
జడ్పీ ఎదుట బారులు

లిక్కర్ టెండర్ల కిక్కు



- లక్కీడ్రాలో షాపుల కేటాయింపు పూర్తి
- జిల్లాలో 99 దుకాణాలు.. 3,046 దరఖాస్తులు
- తొమ్మిది మంది మహిళలకు దక్కిన షాపులు
- తెలంగాణ వాసులకూ దుకాణాలు
- భారీగా పెట్టుబడి పెట్టిన వారికి నిరాశ
- రేపటి నుంచి నూతన షాపులు

జిల్లాలో లిక్కర్ షాపుల కేటాయింపు ప్రక్రియ జాతరలా జరిగింది. దరఖాస్తుదారుల సమక్షంలో.. సీసీ కెమెరాల నిఘాలో లక్కీడ్రా తీశారు. దుకాణాల వారీగా వచ్చిన దరఖాస్తులకు నంబర్లు కేటాయించి, అందరి సమక్షంలో లక్కీ డిప్ తీశారు. షాపులు దక్కించుకున్న వారికి అధికారులు లైసెన్స్‌లు ఇచ్చారు. షాపులు దక్కించుకున్న వారితో అప్పటికప్పుడే లైసెన్స్ ఫీజును వసూలు చేశారు. బుధవారం నుంచి జిల్లాలో కొత్త లిక్కర్ విధానం అమల్లోకి రానుంది. ఇదిలా ఉండగా టీడీపీ కూటమి, ప్రతిపక్ష వైసీపీ నాయకులు మద్యం సిండికేట్‌కు సై అంటున్నారు. వివిధ నియోజకవర్గాల్లో మద్యం దుకాణాలు తగిలిన వ్యాపారులు, తెర వెనుక వారికి మద్దతుగా ఉన్న నేతలు అప్పుడే నీ వాటా.. నా వాటా అని లెక్కలు వేస్తున్నారు. మద్యం వ్యాపారం వద్ద ముఖ్య నాయకులు చేతులు కలుపుతుంటే.. ఇదెక్కడి న్యాయమని ఎన్నికల్లో నువ్వా.. నేనా అంటూ తలపడిన ముఖ్య కార్యకర్తలు, ద్వితీయ శ్రేణి నాయకులు ప్రశ్నిస్తున్నారు. అదే క్రమంలో మద్యం దుకాణాల కోసం రూ.లక్షలు అప్పులు చేసి దరఖాస్తు చేస్తే దుకాణాలు తగలక సొమ్ము పోయి లబోదిబోమంటున్నారు. మద్యానికి వ్యతిరేకంగా పోరాటాలు చేసిన నారీమణులు మేము సైతం అంటూ మద్యం వ్యాపారంలో అడుగులు పెట్టారు. తొమ్మిది మందికి షాపులు దక్కాయి. కర్నూలు నగరంలో అధికార పార్టీకి చెందిన ప్రముఖ నాయకుడి అనుచరులు దాదాపు 246 దరఖాస్తులు చేస్తే ఒక్క షాపు కూడా దక్కలేదు. తెలంగాణకు చెందిన ఓ మహిళ రెండు షాపులకు దరఖాస్తు చేస్తే.. ఆ రెండూ రావడం విశేషం.

కర్నూలు అర్బన్/ కర్నూలు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కర్నూలు, కోడుమూరు, ఎమ్మిగనూరు, కోసిగి, ఆదోని, పత్తికొండ, ఆలూరు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ల పరిధిలో 99 మద్యం దుకాణాలకు 3,046 దరఖాస్తులు వచ్చాయి. మంగళవారం జిల్లా కలెక్టరు పి.రంజిత్‌బాషా ఆధ్వర్యంలో జడ్పీ సమావేశం హాల్‌లో లాటరీ ద్వారా అదృష్టం వరించిన వారికి లీజు సొమ్ము కట్టించుకొని దుకాణాలు అప్పగించారు. 2017 తరువాత ఏడేళ్లకు మళ్లీ టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తులకు మద్యం దుకాణాలు అప్పగిస్తూ పాత ఎక్సైజ్ పాలసీకి శ్రీకారం చుట్టడంతో ఈ నెల ఒకటో తేదీ నుంచి మద్యం వ్యాపారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా సరిహద్దున ఉన్న తెలంగాణ రాష్ట్రానికి చెందిన పలువురు వ్యాపారులు దరఖాస్తులు చేశారు. మద్యం దుకాణాల కోసం దరఖాస్తులు చేసిన వారిలో ముప్పాతిక శాతం ఎమ్మెల్యేలు, టీడీపీ, వైసీపీ కీలకమైన నేతల అనుచరులు, సహచరులే ఉన్నారు. జిల్లా కలెక్టరు పి.రంజిత్‌బాషా, జాయింట్ కలెక్టరు నవ్య, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్ బాబు పర్యవేక్షణలో లాటరీ తీశారు. పక్కా పారదర్శకంగా డిప్ తీయడంతో దుకాణాలు తగిలిన వారు ఆనందంతో బయటికి వస్తే.. ఆశతో దరఖాస్తు చేస్తే సొమ్ములు పోయేనంటూ షాపులు తగలనివారు దిగాలుగా బయటకు వచ్చారు. జడ్పీ ప్రాంగణం, ప్రధాన రహదారులు మద్యం వ్యాపారులు, తోడుగా వచ్చిన అనుచరులు, రాజకీయ పార్టీల కార్యకర్తలతో సందడిగా మారింది.

లాటరీ సిత్రాలెన్నో..!

- కర్నూలు నగరంలో మద్యం వ్యాపారంలో ఎన్నో ఏళ్ల అనుభవం కలిగిన ఓ కీలక మాజీ ప్రజాప్రతినిధి అనుచరులు 60 మంది ఒక గ్రూపుగా 246 దరఖాస్తులు వేస్తే ఒక్క షాపు కూడా దక్కలేదు. నగరంలో అంతర్భాగంగా ఉన్న మరో నియోజకవర్గానికి చెందిన అధికార పార్టీ ముఖ్యనాయకుడి అనుచరులు 186 దరఖాస్తులు చేస్తే దక్కింది ఏడు షాపులే. ఎమ్మిగనూరు సర్కిల్ పరిధిలో కీలక నేత అనుచరులు 58 దరఖాస్తు చేస్తే వారికి వచ్చింది కేవలం రెండు మాత్రమే.
- కర్నూలు నగరానికి చెందిన అధికార పార్టీ ద్వితీయ శ్రేణి నాయకుడు ఒకరు రూ.23 లక్షలు రుసుం చెల్లించి 11 షాపులకు దరఖాస్తులు చేస్తే ఒక్క షాపు కూడా దక్కలేదు. తొలిసారిగా మద్యం వ్యాపారంలో అడుగుపెడుదామనుకుంటే ఆయన డబ్బంతా పోయి ఇంటిదారి పట్టాడు. ఆదోనిలో మాజీ కౌన్సిలర్ ఒకరు రూ.6 లక్షలు అప్పు చేసి మూడు దరఖాస్తులు చేస్తే.. లాటరీలో తగలకపోవడంతో దిగాలుగా ఇంటిదారి పట్టారు.
- తెలంగాణ రాష్ట్రం అలంపూర్ నియోకవర్గం ఎర్రవల్లిచౌరస్తాకు చెందిన సుగాలి లక్ష్మీదేవి కె.నాగులాపురం, కోడుమూరులో రెండు షాపులకు రెండు దరఖాస్తులు చేస్తే.. ఆ రెండు షాపులు ఆమెకే దక్కడం విశేషం.
- హైదరాబాదుకు చెందిన వ్యక్తి ఒకరు రెండు దుకాణాలకు ఆన్‌లైన్ దరఖాస్తు చేస్తే అదృష్టం వరించి రెండు షాపులు దక్కాయి.
- ఎన్నికల్లో ఓట్ల కోసం శత్రువుల్లా తలపడిన టీడీపీ కూటమి, వైసీపీ నాయకులు మద్యం దుకాణాలు లాటరీ నిర్వహించిన జడ్పీ ప్రాంగణంలో భుజాలపై చేతులు వేసుకొని మాట్లాడుకోవడం చర్చనీయాంశంగా మారింది.


లక్కీ డిప్‌లో పాల్గొన్న దరఖాస్తుదారులు

నాడు క్యాషియర్.. నేడు యాజమాని..!



నిన్నటి వరకు మద్యం దుకాణంలో క్యాషియర్ నేడు మద్యం దుకాణానికి యాజమాని అయ్యాడు. సోమవారం జిల్లా పరిషత్‌లో నిర్వహించిన లక్కీడిప్‌లో అతని పేరు రావడంతో కుర్చున్నచోటు నుంచే హాలుదద్దరిల్లేలా కేరింతలు కొట్టాడు. కోడుమూరు మండలం లద్దగిరి గ్రామానికి చెందిన కురువ లక్ష్మి ప్రతాప్ మొన్నటి వరకు తెలంగాణ రాష్ట్రంలోని జోగుళాంబ జిల్లా అలంపూర్‌లో ఉన్న ఓ ప్రైవేట్ మద్యం షాపులో క్యాషియర్‌గా పని చేసేవాడు. ప్రైవేట్ మద్యం దుకాణాల లాటరీ ప్రక్రియలో ఓర్వకల్లు మండలం హుసేనాపురంలోని షాప్ నెంబర్ 29కి దరఖాస్తు చేసుకున్నాడు. లక్కీడిప్‌లో అతడిని విజయం వరించి ఏకంగా మద్యం దుకాణానికి యజమాని అయ్యాడు.


లక్కీ డిప్‌లో పాల్గొన్న మహిళలు



లక్కీ డిప్ తీస్తున్న కలెక్టర్

మిగతా 6లో..

పంటకు వాన ముప్పు

- ఉమ్మడి జిల్లాలో మూడు లక్షల హెక్టార్లలో పంటలు
- చేతికందే దశలో అకాల వర్షాలు
- రైతన్నల తీవ్ర ఆందోళన



కర్నూలు(అగ్రికల్చర్), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): వాతావరణ శాఖ అధికారుల వర్ష సూచనతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పంటల కోతకు సిద్ధమవుతున్న తరుణంలో వర్షం హెచ్చరిక రైతులను కలవరపెడుతోంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపు మూడు లక్షల హెక్టార్లలో ప్రధాన పంటలు సాగయ్యాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా సోమవారం ఉమ్మడి జిల్లా అంతటా మేఘాలు కమ్ముకున్నాయి. ఈ పరిస్థితులను బట్టి చూస్తే రాత్రి నుంచి వర్షాలు మొదలయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే తుంగభద్ర, కృష్ణా నదులు నిండుగా ప్రవహిస్తుండటంతో రాబోయే వర్షాలకు వరద ఉధృతి పెరగనుంది. దీంతో పరిసర గ్రామాల ప్రజలకు అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. పంట పొలాలను వర్షంతో పాటు వరదలు ముంచెత్తే పరిస్థితులు ఉన్నాయని, రైతులను అప్రమత్తం చేయాలని వ్యవసాయ శాఖ అధికారులు తమ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఉమ్మడి జిల్లాలో దాదాపు రెండు లక్షల హెక్టార్లలో పత్తి సాగు చేశారు. 50 వేల హెక్టార్లలో వేరుశనగ, కంది 30వేల హెక్టార్లు, మొక్కజొన్న 30 వేల హెక్టార్లు, ఉల్లి 15 వేల హెక్టార్లు, మిర్చి 12 వేల హెక్టార్లు తదితర పంటలన్నీ కలిపి ఆరు లక్షల హెక్టార్లలో పంటలు సాగయ్యాయి. ప్రస్తుతం రబీ సీజన్ కొనసాగుతుండటంతో పది వేల హెక్టార్లలో పప్పుశనగ పంటను రైతులు సాగు చేశారు. దసరా పండుగ పూర్తయిన వెంటనే గ్రామాల్లో రైతులు పంటలను కోసేసి పంట ఉత్పత్తులను నూర్పిడి చేసుకునేందుకు సమాయత్తం అవుతున్నారు. ఈ పరిస్థితుల్లో 17వ తేదీ వరకు భారీ వర్షాలు పడే అవకాశం ఉండటం వల్ల ఆ పంటలను కాపాడేందుకు ఎలాంటి ఏర్పాట్లు చేయాలో అధికారులకు కూడా దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం వరి పంట గింజ పట్టి కోతకు సిద్ధంగా ఉంది. పత్తి కూడా కాయలు పట్టి పూత వస్తోంది. అక్కడక్కడా పత్తిని తీసే పనులు కూడా రైతులు చేపట్టారు. వర్షం వస్తే పంటలను ఎలా కాపాడాలో సూచనలు ఇవ్వడం తప్ప ఏవిధంగా నష్టాన్ని నివారించాలో వ్యవసాయ శాఖ యంత్రాంగం చెప్పలేని పరిస్థితి.



రైతులకు కర్నూలు మార్కెట్ సెక్రటరీ కమిటీ విజ్ఞప్తి

ఇప్పుడిప్పుడే కర్నూలు, ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులకు ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి రైతులు వేరుశనగ, పత్తి, ఆముదాలు, మొక్కజొన్న, కొర్రలు, సజ్జ, వాము తదితర పంట ఉత్పత్తులను అమ్మకానికి తీసుకువస్తున్నారు. ఉల్లిని కర్నూలు యార్డుకు రోజు దాదాపు ఆరు వేల క్వింటాళ్ల నుంచి పది వేల క్వింటాళ్ల వరకు తెస్తున్నారు. భారీ వర్షాలు కురుస్తాయని, నష్టాన్ని నివారించాలని ప్రభుత్వం జారీ చేసిన హెచ్చరికలతో కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు మార్కెట్ కమిటీల సెక్రటరీలు అప్రమత్తమయ్యారు. సోమవారం కర్నూలు మార్కెట్ కమిటీ సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి అదనపు సెక్రటరీలు, సూపర్ వైజర్లతో సమావేశమయ్యారు. పంట ఉత్పత్తులను కాపాడేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. గ్రామ గ్రామాన కమీషన్ ఏజెంట్లు, వ్యాపారుల చేత పంట ఉత్పత్తులను వర్షం వచ్చే సమయంలో మార్కెట్ యార్డుకు తీసుకు రావద్దని సమాచారం అందించాలని సెక్రటరీ ఆదేశాలు జారీ చేశారు. రైతులు పంట ఉత్పత్తులను ఏ మాత్రం తడవకుండా మార్కెట్ యార్డుకు తీసుకు వచ్చేలా చర్యలు చేపట్టాలని, అదేవిధంగా యార్డులో పంట ఉత్పత్తులు వర్షానికి తడవకుండా అవసరమైన తార్పాలిన్లను సిద్ధం చేయాలని అదనపు సెక్రటరీలు సూపర్‌వైజర్లను ఆదేశించారు.

నాణ్యత తక్కువ.. ధర ఎక్కువ



- నాసిరకంగా పప్పు శనగ విత్తనాలు
- ప్రభుత్వం వ్యాపారులకు ఇచ్చేది క్వింటానికి రూ.9 వేలు
- బహిరంగ మార్కెట్‌లో రూ.7 వేలకే లభ్యం
- ఉమ్మడి జిల్లాకు రూ.71,955 క్వింటాళ్ల కేటాయింపు
- ఖర్చులు పోను వ్యాపారులకు క్వింటాపై రూ.1500 మిగులు
- 71 వేల క్వింటాళ్ల శనగ విత్తనాలపై రూ.10.79 కోట్ల లాభం

కర్నూలు అగ్రికల్చర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో రబీలో రాయితీపై పప్పు శనగ విత్తనాలను సప్లయ్ చేసేందుకు రూ.71,955 క్వింటాళ్ల కేటాయించారు. ఇందుకోసం క్వింటానికి రూ.9 వేల చొప్పున వ్యాపారులకు చెల్లించేలా నిర్ణయించారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో నాణ్యమైన పప్పు శనగ విత్తనాల ధర క్వింటానికి రూ.7 వేలు మాత్రమే లభిస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. అయితే.. ప్రభుత్వం వ్యాపారులకు క్వింటానికి రూ.9 వేలు చెల్లిస్తూ తీసుకున్న నిర్ణయం వెనుక రాజకీయ నాయకుల హస్తం స్పష్టంగా కనిపిస్తోందని రైతు సంఘాల ప్రతినిధులు ధ్వజమెత్తుతున్నారు. అంత పెద్ద మొత్తంలో ధర చెల్లించినా కనీసం మంచి విత్తనాలనైనా అందిస్తున్నారా అంటే అదీ లేదు. ఆస్పరి మండల కేంద్రంలో బుధవారం ఏపీ సీడ్స్ సంస్థ సప్లయ్ చేసిన శనగ విత్తనాలు నాణ్యతగా లేవని నిర్ధారించిన వ్యవసాయ శాఖ అధికారులు వాటిని వెనక్కు పంపించేశారు. అదేవిధంగా నందికొట్కూరు నుంచి కర్నూలు డివిజన్‌కు సప్లయ్ చేసిన 150 క్వింటాళ్ల శనగ విత్తనాలు నాణ్యతగా లేకపోవడంతో ఏడీఏ శాలురెడ్డి ఈ విత్తనాలు తమకు వద్దని వెనక్కు పంపించేశారు. చాలా చోట్ల నాసిరకం శనగ విత్తనాలపై రైతులు ఆరోపణలు చేస్తున్నారు. ఆస్పరిలో విక్రయిస్తున్న నాసిరకం శనగ విత్తనాలను కడప నుంచి తెప్పించినట్లు వ్యవసాయ శాఖ అధికార వర్గాలు తెలిపాయి. తమకు నాసిరకం విత్తనాలను ప్రభుత్వమే అంటగడుతుంటే.. తమ బాధ ఎవరికి చెప్పుకోవాలని అన్నదాతలు కన్నీళ్లు పెట్టుకుంటున్నారు.

మిగతా 7లో..

'పల్లె పండుగ'తో ప్రగతి పరుగులు

- రూ.82 కోట్లతో 1,562 అభివృద్ధి పనులకు శ్రీకారం
- కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్నూలు రూరల్, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా చేపట్టిన పల్లె పండుగ కార్యక్రమం ద్వారా గ్రామీణా ప్రాంతాల్లో ప్రగతి పరుగులు తీస్తుందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా పేర్కొన్నారు. సోమవారం కర్నూలు రూరల్ మండలం గొందిపర్ల గ్రామంలో పల్లె పండుగ వారోత్సవాలకు కలెక్టర్‌తో పాటు కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా రూ.82 కోట్లతో 1,562 అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు వివరించారు. అందులో కోడుమూరు నియోజకవర్గంలో రూ.12.65కోట్లు కేటాయించామన్నారు. కర్నూలు మండలానికి రూ.4.28కోట్లు వెచ్చించామని తెలిపారు. గొందిపర్ల గ్రామానికి రూ.41.62లక్షల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు సూచించారు. కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ గ్రామాలను అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర మంతటా అనేక నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్నారన్నారు.


గొందిపర్లలో నిర్వహించిన పల్లెపండుగ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్

ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ దశల వారీగా నెరవేరుస్తున్నామన్నారు. మహిళలకు దీపావళి కానుకగా ఉచిత గ్యాస్ సిలిండర్లను అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో నాసరరెడ్డి, పీఆర్ ఎస్ఈ రామచంద్రారెడ్డి, డీపీవో భాస్కర్, గ్రామ సర్పంచు శ్రీనివాసులు, కోడుమూరు నియోజకవర్గ పీఆర్ డీఈ కర్రెన్న, మండల అధికారులు ముక్తార్‌భాష, ఎంపీడీవో రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగ ధర పతనం

క్వింటా గరిష్ఠంగా రూ.6,800

ఆదోని అగ్రికల్చర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో వేరుశనగ ధరలు భారీగా పతనమయ్యాయి. గత వారంతో పోల్చితే వేరుశనగ ధరలు క్వింటాకు రూ.800 వరకు పతనమయ్యాయి. సోమవారం వేరుశనగ ధర గరిష్ఠంగా రూ.6,800కు పడిపోయింది. వేరుశనగ ధరలు పతనమవుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.



సాగుకు పెట్టిన పెట్టుబడి ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా మార్కెట్‌కు 7,742 బస్తాల వేరుశనగ విక్రయానికి రాగా వాటి కనిష్ఠ ధర రూ.3,306, గరిష్ఠ ధర రూ.6,800, మధ్యస్థ ధర రూ.6,496 పలికింది.

వినూత్నం



విమానభోజనంబు..!

వినూత్న రీతిలో హోటల్

ఆకట్టుకుంటున్న దూపాడు ఎయిర్‌బస్

విమానం ఎక్కి విహంగ ప్రయాణం చేయాలని ఎవరికి ఉండదు. విమానంలో ప్రయాణిస్తూ ఇష్టమైన ఫుడ్‌ను ఆర్డర్ చేసి విమాన కిటికీల్లోంచి నగరాన్ని చూడాలని ఎవరికైనా ఉంటుంది. మధ్యతరగతి కుటుంబాలకు ఇవన్నీ నెరవేరడం అసాధ్యం అనుకుంటున్నారు కదూ! డబ్బులుంటే అవేవీ తీరని కోరికలు కావని అంటున్నారు ఎయిర్‌బస్ రెస్టారెంట్ నిర్వాహకులు. విమానం ఎక్కిన అనుభూతి కలిగేలా ఉన్న రెస్టారెంట్ ఇప్పుడు కర్నూలు నగర ప్రజలను ఆకట్టుకుంటోంది.

కల్లూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి):

రెస్టారెంట్స్, హోటల్స్ అనగానే ప్రధాన రోడ్ల వెంట రంగు రంగుల లైటింగ్‌తో కొత్తగా కస్టమర్లను ఆకట్టుకోవడానికి నిర్వాహకులు విశ్వప్రయత్నాలు చేస్తుంటారు. పిల్లలు, ఉద్యోగులు, మధ్యతరగతి ప్రజలతో పాటు అన్నివర్గాల వినియోగదారులను కట్టిపడేయడానికి వినూత్న రీతిలో ఆలోచిస్తుంటారు. కర్నూలు నగరానికి 7 కిలోమీటర్ల దూరంలో బెంగళూరు జాతీయ రహదారి దూపాడులో ఎయిర్‌బస్ రెస్టారెంట్ ప్రస్తుతం ట్రెండీగా నిలిచింది. పెద్దపెద్ద నగరాలు, మెట్రో సిటీలకే పరిమితమైన విలాసవంతమైన ఎయిర్‌బస్ రెస్టారెంట్‌ను కర్నూలు జిల్లా ప్రజలకు చేరువ చేశారు నిర్వాహకులు హఫీజ్. దాదాపు రూ.2కోట్లతో విమానాన్ని కొనుగోలు చేశారు. ఢిల్లీ నుంచి రోడ్డు మార్గాన ఈ విమానం చేరుకోవడానికి 20 రోజులు సమయం పట్టినట్లు మేనేజర్ సయ్యద్‌అబ్బాస్ వివరించారు. మొత్తం మూడు ఎకరాల్లో కర్నూలు సిటీ ఆన్ వింగ్స్ ఆధ్వర్యంలో కర్నూల్ ఫస్ట్ ఎయిర్‌బస్‌ను నెలకొల్పారు. పట్టణ ప్రజల ఆసక్తి, అభిరుచులకు అనుగుణంగా విలాసవంతమైన కర్నూలు ఫస్ట్ ఎయిర్‌బస్ రెస్టారెంట్‌ను ఏర్పాటు చేశారు నిర్వాహకులు. బర్త్‌డే మొదలుకుని ఎలాంటి ఫంక్షన్లు అయినా నిర్వహించుకునేలా ఏర్పాట్లు చేశారు. చిన్నారుల కోసం గేమింగ్ జోన్, ఆటవస్తువులు ఏర్పాటు చేశారు. లోపలికి వెళ్లగానే ఎయిర్‌హోస్టెస్‌తో స్వాగతం మొదలుకుని అన్నీ నిజమైన విమానంలో ఉన్నట్టే అనుభూతి కలిగిస్తుంది. అన్నట్టు ఈ హోటల్ ఫ్లైట్‌ను ఎక్కాలంటే బోర్డింగ్ పాస్ తప్పనిసరి మరి.













మందుబాబుపైకి కొండ చిలువ



మందుబాబుపై పాకుతున్న కొండచిలువ

అవుకు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగిన మైకంలో ఉన్న ఓ వ్యక్తి తనపైకి కొండచిలువ పాకినా పట్టించుకోలేదు. శింగనపల్లె గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ డ్యూటీ దిగి ఫుల్‌గా మద్యం సేవించాడు. మద్యం మత్తులో తూగుతూ గ్రామంలోని బీసీ కాలనీలోని ఆంజనేయస్వామి ఆలయం సమీపంలోకి చేరుకున్నాడు. సరిగా నడవలేని స్థితిలో అక్కడే ఉన్న ఓ అరుగుపై కూర్చున్నాడు. సమీపంలోని పొదల్లో నుంచి వచ్చిన ఓ కొండచిలువ ఏకంగా ఆ వ్యక్తిపైకి పాకుతూ మెడపైకి వెళ్లింది. అక్కడి నుంచి కిందికి పాకుతున్నా స్పర్శ లేకుండా ఉన్న మందుబాబును స్థానికులు గమనించారు. కట్టెలతో కొండ చిలువను పక్కకు లాగేయడంతో కొండ చిలువ పొదల్లోకి వెళ్లిపోయింది.

పునఃప్రారంభం కానున్న ప్రత్యేక రైళ్లు



ఆదోని టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కరోనా సమయంలో రద్దు అయిన రెండు ప్రత్యేక రైళ్లను ఈనెల 17వ తేదీ నుంచి తిరిగి ప్రారంభిస్తున్నట్లు రైల్వే అధికారులు సోమవారం తెలిపారు. బెళగావి నుంచి మునుగురు వరకు వెళ్లే రైలు (07335)ను 16న తేదీ నుండి ప్రతి ఆది, బుధ, శని, మంగళవారాల్లో నడుస్తాయన్నారు. అదేవిధంగా మునుగురు నుంచి బెళగావి వరకు వెళ్లే రైలు (07336) 17వ తేదీ నుంచి ప్రతి సోమ, గురు, ఆది, బుధవారాల్లో ప్రయాణికులకు అందుబాటులోకి రానున్నాయి. వచ్చే ఏడాది మార్చి 30వ తేదీ వరకు నడిచే ఈ ప్రత్యేక రైళ్లు ఖానాపూర్, లోండా, అల్నావర్, ధార్వాడ, హుబ్బళ్లి, గదగ్, కొప్పల్, హోస్పెట్, తోర్నగల్, బళ్లారి, గుంతకల్లు, ఆదోని, కోసిగి, మంత్రాలయం రోడ్, రాయచూరు, కృష్ణ, యాదగిరి మీదుగా భద్రాచలం రోడ్ వరకు వెళ్తుందని అధికారులు తెలిపారు.

శనగ విత్తనాల పంపిణీపై శ్రద్ధ ఏదీ..?

- జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి



కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత రబీ సీజన్‌లో ఉమ్మడి కర్నూలు జిల్లాలో 60 నుంచి 80 శాతం మంది రైతులు సాగు చేసే శనగ విత్తనాల పంపిణీపై రాష్ట్ర ప్రభుత్వం ఏ మాత్రం శ్రద్ధ చూపించడం లేదని జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన తన చాంబర్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 17 మండలాల్లో విత్తనాలను పంపిణీ చేశామని అధికారులు చెబుతున్నారన్నారు. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం రైతులకు విత్తనాలు దక్కడం లేదన్నారు. ఉమ్మడి జిల్లాలో మెజారిటీ మండలాల్లో నేటికి నాణ్యమైన శనగ విత్తనాలను పంపిణీ చేయలేదన్నారు. రైతుకు పెట్టుబడి సాయం కింద రూ.20వేలు అందిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ఏమైందన్నారు. నేటి వరకు నయాపైసా కూడా అందించలేదన్నారు. బహిరంగ మార్కెట్‌లో రూ.9,400 నిర్ణయించి 25 శాతం సబ్సిడీతో రైతులకు ఒక క్వింటాకు రూ.7,050 చొప్పున అందిస్తోందన్నారు. ప్రస్తుతం డబ్బు చెల్లించినా పది రోజుల కు కూడా విత్తనాలు అందించలేని పరిస్థితి నెలకొందన్నారు. గత సెప్టెంబరు 25వ తేదీ నాటికి రైతాంగానికి అవసరమైన శనగ విత్తనాలను అందుబాటులోకి ఉంచుకోవాలని జడ్పీ స్థాయి సంఘం సమావేశాల్లోనే వ్యవసాయ శాఖ అధికారులను కోరామన్నారు. అయినా అధికారులు ఆ దిశగా చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు.

లిక్కర్ కిక్కు



లక్కీ డిప్ తీసిన ఎక్సైజ్ పోలీసు అధికారి

(5వ పేజీ తరువాయి)

కర్నూలు జిల్లా వ్యాప్తంగా 99 మద్యం దుకాణాలు ఉంటే. టీడీపీ కూటమి మద్దతుదారులకు 46, వైసీపీ మద్దతుదారులకు 27, ఇతరులకు 18, తెలంగాణ వ్యాపారులకు 9 షాపులు లాటరీలో తగిలినట్లు తెలుస్తోంది. మెజార్టీ దుకాణాలు టీడీపీ కూటమి మద్దతుదారులకే వచ్చినా వారిలో పలు గ్రూపులు ఉన్నాయి. పోటీపోటీగా వ్యాపారాలు చేస్తే నష్టపోతాం. సిండికేట్‌గా ఏర్పడి వ్యాపారం చేద్దాం అంటూ ముఖ్యనాయకులు ప్రతిపాదనలు పెట్టినట్లు సమాచారం. సిండికేట్‌గా ఏర్పడితే ఎమ్మెల్యే వాటా ఎంత..? ప్రతిపక్ష పార్టీ నాయకుడి వాటా ఎంత..? ఈ లెక్కలు తేల్చేందుకు కుస్తీ పడుతున్నారు. ఆదోని డివిజన్ పరిధిలో ఓ నియోజకవర్గం ఎమ్మెల్యే వాటా 50 శాతం ఇవ్వాలని తేల్చి చెప్పినట్లు ప్రచారం జరుగుతోంది. ప్రతిపక్ష ఎమ్మెల్యే అనుచరులకు రెండు షాపులు దక్కాయి. ఆయనను కూడా సిండికేట్‌లో భాగం చేసేందుకు ఎన్నో ఏళ్లుగా మద్యం వ్యాపారం కొనసాగుతున్న అధికార పార్టీ నాయకులు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. బీసీలకు పట్టున్న నియోజకవర్గాల్లో టీడీపీ మద్దతుదారులకే ఎక్కువ షాపులు తగిలినా.. గ్రూపుల వల్ల మద్యం లాభాల్లో వాటా కోసం కుస్తీకి సిద్ధమయ్యారు. చారిత్రాత్మక నేపథ్యం కలిగిన కీలక నియోజకవర్గం పరిధిలో మెజార్టీ వైసీపీ మద్దతుదారులకే దక్కాయి. ఇక్కడ టీడీపీ, బీజేపీ మద్దతుదారులకు నాలుగు షాపులు వచ్చాయి. ఇక్కడి సిండికేట్ అవుతారా..? అవినీతికి, వాటాలకు తాను వ్యతిరేకిని అంటూ ప్రచారం చేసుకుంటున్న ఎమ్మెల్యే అడ్డుకుంటారా..? అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. నాలుగు నెలల క్రితం ఓట్ల కోసం ఒకరిపై ఒకరు విమర్శలు తూటాలు పేల్చుకున్న నాయకులు.. కాసులు వర్షం కురిపించే మద్యం వ్యాపారంలో నువ్వా-నేను అంటూ జతకట్టేందుకు సిద్ధం కావడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తున్నాయి. సిండికేట్ అవుతారా..? ప్రభుత్వం నిబంధనలు మేరకు మద్యం వ్యాపారాలు చేస్తూ ప్రభుత్వానికి మంచి పేరు తెస్తారా..? అన్నది వేచిచూడాలి.



లక్కీ డిప్ డ్రాలో పాల్గొన్న దరఖాస్తుదారులు

మద్యం వ్యాపారంలో మహిళలు..!

మద్యం వ్యాపారంలో మేము సైతం అంటూ మహిళలు ముందుకు వచ్చారు. లాటరీలో అదృష్టం వరించి తొమ్మిది దుకాణాలు తగిలాయి. సుగాలి లక్ష్మీదేవి-2, సన్నపురెడ్డి సుజల-2, వెంకట సబ్బమ్మ, వెన్నపూస పావని, రమా, తలారి అనిత, తలారి అమ్మమ్మ చెరో ఒక దుకాణం దక్కించుకున్నారు. జిల్లాలో నలుగురు రెండు దుకాణాలు దక్కించుకుంటే వారిలో ఇద్దరు మహిళలే కావడం కొసమెరుపు.



లీజు మొదటి వాయిదా రూ.10.52 కోట్లు

దరఖాస్తు రుసుం రూపంలో ఇప్పటికే ఖజానాకు రూ.63.55 కోట్లు చేరింది. లాటరీ ద్వారా దుకాణం దక్కించుకున్న వ్యాపారులు తొలి వాయిదా (2 నెలలకు) 99 షాపుల నుంచి రూ.10.60 కోట్లు ప్రభుత్వానికి మద్యం ఆదాయం వచ్చింది. 16వ తేది నుంచి ప్రైవేటు వ్యాపారులకు దుకాణాలు అప్పగిస్తారు. బుధవారం నుంచి మద్యం షాపుల్లో కావాల్సిన మద్యం అందుబాటులోకి రానుంది. అలాగే సామాన్య మద్యం ప్రియుల కోసం రూ.99లకే క్వార్టర్ మద్యం కూడా అందుబాటులోకి తెస్తున్నారు. మద్యం షాపుల లాటరీ సందర్భంగా ఎలాంటి అవాంచనీయ సంఘటలు జరగకుండా డీఎస్పీ బాబుప్రసాద్ అధ్వర్యంలో భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు.



జడ్పీ వద్ద పోలీసు బందోబస్తు

పొత్తులో పోట్లాట

- ఆరేకల్లులో ఆగిన మధ్యాహ్న భోజనం
- ఖాళీ ప్లేట్లతో విద్యార్థుల నిరసన
- వంట గదికి తాళం వేసిన కూటమి నాయకులు



ఖాళీ ప్లేట్లతో నిరసన తెలుపుతున్న ఆరేకల్లు విద్యార్థులు

ఆదోని రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆదోని రాజకీయం అటు ఇటు తిరిగి విద్యార్థుల మధ్యాహ్న భోజనంపై పడుతోంది. కూటమి పొత్తు పోట్లాటతో ఎక్కడో ఒక చోట ఘర్షణలు జరుగుతూనే ఉన్నాయి. ఆదోని కూట మి ఎమ్మెల్యే పార్థసారథి, మాజీ టీడీపీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడుకు మధ్య పచ్చిగడ్డి వేస్తే భగ్గుమంటోంది. ఈ క్రమంలోనే ఆరేకల్లు మధ్యాహ్న భోజన ఏజెన్సీ జనసేనకు, ఫీల్డ్‌అసిస్టెంట్, డీలర్ తదితర పదవులు టీడీపీ, బీజేపీలకు కేటాయించారు. దసరా సెలవుల ముందు వరకు పాఠశాలలో వైసీపీ నాయకుడు తిమ్మారెడ్డి భార్య రాజేశ్వరి మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వహించేది. జనసేనకు చెందిన తిమ్మప్ప మధ్యాహ్న భోజనం ఏజెన్సీ నిర్వహిస్తాడని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఇందులో భాగంగా, సోమవారం పాఠశాలలు పునః ప్రారంభం అయ్యాయి. తమ సమస్య పరిష్కారమయ్యే వరకు జనసేన వాళ్ల పాఠశాలలో వంట వండే ప్రసక్తే లేదని టీడీపీ నాయకులు పాఠశాల కెళ్లి వంట గదికి తాళం వేసి అక్కడే బైఠాయించారు. మధ్యాహ్నం 12.30 గంటలు కావస్తున్నా విద్యార్థులకు భోజనం పెట్టలేదు. జడ్పీ హైస్కూలులో మొత్తం 6 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులు 450 మంది ఉండగా 50 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో బాలికలు, బాలురు ఖాళీ ప్లేట్లతో పాఠశాల బయటకొచ్చి నిరసన తెలిపారు. తాము చిన్న పెండేకల్లు, పెద్దపెండేకల్లు, నాగలాపురం, తదితర సుదూర గ్రామాల నుంచి పాఠశాలకు వచ్చాం. తమకు అన్నం పెట్టకపోతే ఎలా అంటూ చిన్నారులు ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు చిప్స్ (కురుకురే)తిని, మరికొందరు నీళ్లు తాగి కడుపు నింపుకున్నారు.



వంట గదికి తాళం వేసిన కూటమి నాయకులు

ఆకలి తట్టుకోలేక నీళ్లు తాగినా

ఉదయం నుంచి పాఠశాల వద్ద రాజకీయ నాయకులు కొట్లాడుతున్నారు. ఒంటి గంట దాటినా అన్నం పెట్టలేదు. బిస్కెట్లు కొనుక్కొని తిందామన్నా డబ్బులు లేవు. ఆకలి తట్టుకోలేక నీళ్లు తాగి కడుపునింపుకున్నా.

-భాగ్యరాజు, 6వ తరగతి విద్యార్థి, ఆరేకల్లు

పస్తుండక తప్పదు

మధ్యాహ్న భోజనం పెట్టకపోతే ఎలా. మేము ఆడపిల్లలం. ఎక్కడికెళ్లి తింటాం. చదవుకొనే మాలాంటి విద్యార్థులతో రాజకీయాలు చేయడమేమిటి. ఇంటికెళ్లి తిందామన్నా మా ఊరు 10 కి.మీ. దూరంలో ఉంది. ఈ రోజు పస్తుండక తప్పదు.

-పెద్దపెండేకల్లు అమృత, 8వ తరగతి, ఆరేకల్లు

వంట వండకుండా అడ్డుకున్నారు....

పాఠశాలలో వంట వండే ఏజెన్సీ తిమ్మప్పకు అధికారులు ఆదేశాలు జారీ చేశారు. మా సమన్య సమస్య పరిష్కారమయ్యే వరకు పాఠశాలలో వంటలు వండనివ్వమని గ్రామానికి చెందిన కొందరు వచ్చి అడ్డుకున్నారు. ఏం చేయాలో తెలియక పైస్థాయి అధికారులకు సమాచారం ఇచ్చాను.

-సుబ్రహ్మణ్యం, ప్రధానోపాధ్యాయులు, ఆరేకల్లు



కురుకురే ప్యాకెట్లు తింటున్న విద్యార్థులు

నాణ్యత తక్కువ.. ధర ఎక్కువ..

శనగ విత్తనాల సేకరణలో గోల్‌మాల్




5వ పేజీ తరువాయి

ప్రస్తుత ఖరీఫ్‌లో కర్నూలు జిల్లాకు 45,955 క్వింటాళ్లు, నంద్యాల జిల్లాకు 26 వేల క్వింటాళ్లు మొత్తం 71,955 క్వింటాళ్ల శనగ విత్తనాలను 20 శాతం రాయితీపై రైతులకు అందించేందుకు వ్యవసాయ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. నందికొట్కూరు, కడపతోపాటు నంద్యాల ప్రాంతంలో ఉన్న ప్రాసెసింగ్ యూనిట్ల యజమానులకు ఈ విత్తనాలను సప్లయ్ చేసేందుకు ఏపీ సీడ్స్ సంస్థ అధికారులు ఒప్పందం చేసుకున్నారు. వ్యాపారులు సిండికేట్‌గా మారి శనగ విత్తనాల ధరను పెద్ద ఎత్తున పెంచుకునేందుకు చేసిన ప్రయత్నాలకు కొంతమంది ముఖ్యమైన నాయకులు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చినట్లు సమాచారం. వాస్తవంగా రైతులు చెబుతున్న వివరాల మేరకు ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో క్వింటం శనగ విత్తనాల ధర రూ.7 వేలు మాత్రమే ఉంది. అటువంటి సమయంలో వ్యాపారులకు క్వింటానికి రూ.9 వేలు చెల్లించి నాసిరకం విత్తనాలను రైతులకు అందించాల్సిన అవసరం ఏమిటని..? ఈ వ్యవహారంలో పెద్ద ఎత్తున ప్రభుత్వంలోని కొంత మంది పెద్దలకు వ్యాపారులు గుడ్‌విల్ చెల్లించినట్లు అర్థమవుతోందని రైతు సంఘాల ప్రతినిదులు ఆరోపిస్తున్నారు. క్వింటం శనగ విత్తనాలపై వ్యాపారులకు ప్రభుత్వం నిర్ణయించిన 9వేలను పరిగణనలోకి తీసుకుంటే ఖర్చులు పోను రూ.1,500లు మిగులుబాటు అవుతుంది. ఉమ్మడి కర్నూలు జిల్లా మొత్తం మీద రూ.71,955 క్వింటాళ్లపై క్వింటానికి రూ.1,500 మిగులుబాటును లెక్కేస్తే రూ.17.79 కోట్లు వ్యాపారుల చేతికి దక్కుతోంది. ఈ మొత్తంలో 10 నుంచి 20 శాతం అధికారులకు, రాజకీయ నాయకులకు చెల్లించినా దాదాపు రూ.6 కోట్లకు పైగానే వ్యాపారుల జేబుల్లో పడినట్లే.

పెద్ద మొత్తంలో ధర చెల్లించినా నాణ్యమైన పప్పు శనగ విత్తనాలు కాకుండా మార్కెట్ యార్డులో తక్కువ ధరకే అంటే క్వింటానికి రూ.6,7 వేలకు కొనుగోలు చేసి రూ.9 వేలకు బేరాలు కుదుర్చుకుని ఏపీ సీడ్స్ సంస్థకు తగలగడుతున్న వ్యాపారులు కనీసం నాణ్యతతో కూడిన విత్తనాలనైనా సప్లయ్ చేయకపోవడంతో రైతుల నుంచి తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. ఆస్పరి మండల కేంద్రంలో 250 క్వింటాళ్ల పప్పు శనగ విత్తనాలు నాసిరకం అని తేలడంతో బుధవారం

విత్తన నాణ్యత లేక తిప్పి పంపుతున్న అధికారులు



స్థానిక వ్యవసాయ అధికారులు వాటిని ఏపీ సీడ్స్ సంస్థకు వెనక్కు లారీ ద్వారా పంపించేశారు. అదేవిధంగా నందికొట్కూరులో సుభాని ప్రాసెసింగ్ యూనిట్‌లో ఏ మాత్రం క్లీనింగ్ చేయని విత్తనాలు సప్లయ్ చేసినట్లు తేలింది. దీంతో కర్నూలు ఏడీఏ శాలురెడ్డి ఇంకోసారి నాణ్యత లేని విత్తనాలు తమకు సప్లయ్ చేయవద్దని ఏపీ సీడ్స్ సంస్థ అధికారులకు తెలియజేసినట్లు సమాచారం. కొనుగోలు కేంద్రాల నుంచి రైతులకు అందజేసే విత్తనాలు చెత్తాచెదారం రెండు శాతమే ఉండాలని 10.10 ఎంఎం సైజులో విత్తనాలు ఉండాలని, అదే విదంగా 85 శాతం(మొకల శాతం) జనరేషన్ ఉండాలని ఏడీఏ స్పష్టం చేశారు.

క్రిమినల్ కేసులు నమోదు చేయండి



బయటి మార్కెట్‌లో క్వింటం శనగ విత్తనాల ధర రూ.7వేల లోపు ఉంది. అయితే ఏపీ సీడ్స్ సంస్థ రూ.9 వేలు చెల్లించి వ్యాపారుల నుంచి నాసిరకం విత్తనాలను కొనుగోలు చేయడం దారుణం. ఏటా ఖరీఫ్, రబీ సీజన్లలో రాయితీపై అందించే వేరుశనగ, పప్పుశనగ విత్తనాల సప్లయ్‌లో వ్యాపారులు పెద్ద ఎత్తున లాభపడుతుంటే.. రైతులు మాత్రం దిగుబడి కోల్పోయి తీవ్రంగా నష్టపోతున్నారు.

- రామకృష్ణ, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

నాణ్యమైన విత్తనాలనే అందిస్తాం



రైతులకు ఖరీఫ్, రబీ సీజన్లలో నాణ్యత కలిగిన విత్తనాలను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. కొన్ని ప్రాంతాల్లో రైతుల నుంచి ఫిర్యాదులు వస్తున్న మాట వాస్తవం. ఆస్పరిలో నాసిరకం విత్తనాలని తేల్చి మా అధికారులు వెనక్కు పంపారు. ఈ వ్యవహారంపై ఏపీ సీడ్స్ సంస్థ అధికారులకు వివరణ ఇవ్వాలని లెటర్ రాశాం. నందికొట్కూరుతోపాటు కడప జిల్లా నుంచి కర్నూలు జిల్లాకు శనగ విత్తనాలను ఏపీ సీడ్స్ సంస్థ అందిస్తోంది. నాసిరకం విత్తనాలను రైతులకు అంటగట్టే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటాం. **- వరలక్ష్మి, జేడీ, కర్నూలు.**

పత్తి రైతు గుండెల్లో గుబులు

మళ్లీ మూడు రోజులపాటు వర్షాలు



ఎమ్మిగనూరు మండలంలో సాగు చేసిన పత్తి పంట

ఎమ్మిగనూరు రూరల్, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): తుపాన్ హెచ్చరిక పత్తి రైతుల గుండెల్లో గుబులు రేపుతోంది. పత్తి పంట చేతికొచ్చిన సమయంలో వర్ష సూచన అన్నదాతలను ఆందోళనకు గురి చేస్తోంది. కర్నూలు జిల్లా వ్యాప్తంగా పత్తి సాగుపై రైతులు గత కొన్నేళ్లుగా అమితాసక్తిని చూపుతున్నారు. ఈ ఏడాది కూడా జిల్లాలో రెండు లక్షలా ఒక వెయ్యి హెక్టార్లలో రైతులు పత్తి సాగు చేశారు. ఇందుకు గాను రైతన్నలు లక్షలాది రుపాయల పెట్టుబడి పెట్టారు. రైతులు సాగు చేసిన పత్తిపంట ప్రస్తుతం చేతికొస్తోంది. జిల్లాలో ఆయా ప్రాంతాల్లో ఇప్పటికే కొంతమంది రైతులు పత్తిని తీసి విక్రయాలు చేస్తున్నారు. మరికొంతమంది పత్తిని తీస్తున్నారు. ఈ తరుణంలో వర్షాలు వస్తున్నట్లు వాతావరణ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. మూడు రోజుల పాటు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని అధికారులు తెలపడంతో రైతన్నల గుండెల్లో గుబులు రేగింది. వర్షాలు కురిస్తే పత్తికాయలు మురిగిపోవడమేగాక, చేతికొచ్చిన పత్తి సైతం నాణ్యత తగ్గి, రంగు మారుతుందన్న ఆందోళనలో రైతులు ఉన్నారు. దీంతో ఈ ఏడాది కూడా అతివృష్టి వల్ల తాము నష్టాల పాలవుతామోనన్న అనుమానాన్ని రైతన్నలు వ్యక్తం చేస్తున్నారు.

ఈ సమయంలో వర్షాలు వస్తే నష్టమే



ఈ సమయంలో వర్షాలు పడితే పత్తికాయలు మురిగిపోతాయి. పత్తి రంగు మారుతుంది. దీంతో మార్కెట్‌లో ధర రాక నష్టాలు చవిచూడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఎకరా పత్తిపంట సాగు చేసేందుకు దాదాపు రూ.25 వేల నుంచి రూ.30వేల వరకు ఖర్చు వస్తుంది. పంటచేతికొచ్చే సమయంలో వర్షం కురిస్తే పెట్టిన పెట్టుబడి కూడా రాదు. **- నాగయ్య, రైతు, కొటేకల్లు**

మంత్రాలయం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న తుంగభద్ర ↓



పెరిగిన తుంగభద్ర నీటి మట్టం

మంత్రాలయం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల మధ్య ప్రవహిస్తున్న తుంగభద్ర నది పరవళ్లు తొక్కుతోంది. సోమవారం సాయంత్రం 7 గంటలకు మంత్రాలయం వద్ద 91,720 క్యూసెక్కులతో 310.650 మీటర్ల నీటి మట్టంతో రెండు రాష్ట్రాల సరిహద్దులను తాకుతూ ప్రవాహం ఊపందుకుంది. దీంతో మంత్రాలయం తహసీల్దార్ రవి తుంగభద్ర నదితీరాన్ని పరిశీలించారు.

వరద ఉధృతిని అంచనా వేసి భక్తులు, నదీతీర గ్రామాల రైతులను అప్రమత్తం చేశారు. శ్రీమఠం ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్ వెంకటేశ్ జోషి, శ్రీపతాచార్‌లు పుణ్య స్నానాలకు వెళ్లే భక్తులకు మైకుల ద్వారా

మైకుల ద్వారా హెచ్చరికలు

హెచ్చరికలు చేశారు. ముందు జాగ్రత్తలో భాగంగా నది ఒడ్డున పుట్టీలు ఏర్పాటు చేసి గజ ఈతగాళ్లను సిద్ధం చేశారు.

ప్రస్తుతం హోస్పేట్ టీబీ డ్యాంలో 1631.95 మీటర్ల నీటి మట్టం ఉంది. డ్యాంలోకి ఇన్‌ఫ్లో 50,290 క్యూసెక్కులు రాగా, తుంగభద్ర నదికి 31,642 క్యూసెక్కులకు తగ్గించారు. మంత్రాలయం వద్ద గంగమ్మ దేవాలయం వరద తాకుతూ ప్రవహిస్తుండటంతో నదీతీర గ్రామాల్లో వీఆర్వోలు, వీఆర్ఏలతో దండోరా వేయించి పశువుల కాపర్లు, చేపల వేటకు వెళ్లే వారికి, నదీతీర విద్యుత్ మోటార్ల రైతులను నదిలోకి వెళ్లవద్దంటూ ఆదేశాలు జారీ చేశారు.

ఎర్రమట్టి తరలిస్తే చర్యలు

సి. బెళగల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి):

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అనుమతి లేకుండా ఎర్రమట్టి తరలిస్తే చర్యలు తప్పవని కర్నూలు మైనింగ్ అధికారులు హెచ్చరించారు. సోమవారం మండలంలోని బ్రాహ్మణదొడ్డి, బురాన్‌దొడ్డి, క్రిష్ణదొడ్డి, పోలకల్, తిమ్మనదొడ్డి, సంగాల, చింతమానుపల్లె గ్రామాల్లోని ఎర్రమట్టి కొండలను వీఆర్వోలతో కలిసి పరిశీలించారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో వెలువడిన కథనానికి స్పందించి మైనింగ్ అధికారులు ఎర్రమట్టి కొండలను పరిశీలించారు. తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ అనుమతి లేకుండా ఎర్రమట్టిని తరలించకుండా టీమ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

బైకు, లారీ ఢీ.. వ్యక్తి మృతి

కోవెలకుంట్ల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి):

లారీని బైకు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం రాత్రి సౌదరదిన్నె గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి వివరాల మేరకు.. బనగానపల్లె మండలం ఇల్లూరు, కొత్తపేట గ్రామానికి చెందిన షేక్ మహబూబ్‌బాషా (27) అనే వ్యక్తి బైకుపై కోవెలకుంట్లకు వస్తూ సౌదరదిన్నె బస్టాండు దగ్గర ఆగి ఉన్న లారీని ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య ఒక కొడుకు ఉన్నారు. మృతుని తండ్రి అబ్దుల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆటో బోల్తా.. నలుగురికి తీవ్ర గాయాలు



చికిత్స చేస్తున్న వైద్యులు

కోసిగి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గౌడగల్లు గ్రామ సమీపంలో ఉరుకుందకు వెళ్లే భక్తుల ఆటో బోల్తా పడి నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన సోమవారం చోటు చేసుకుంది. కోసిగి మండల పరిధిలోని దుద్ది గ్రామానికి చెందిన చంద్రమ్మ, లక్ష్మి, చిన్న ఉలిగయ్య, పార్వతి కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం ఉరుకుంద దేవస్థానానికి ఆటోలో బయలుదేరారు. గౌడగల్లు సమీపంలోని ఆంజనేయ స్వామి దేవాలయం దగ్గర రోడ్డు మలుపు వద్ద ఆటో బోల్తా పడి దుద్ది గ్రామానికి చెందిన చంద్రమ్మ, లక్ష్మి, ఉలిగయ్య, పార్వతిలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో మెరుగైన వైద్యం కోసం ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ఇంటి నుంచి తప్పిపోయిన చిన్నారులు



పిల్లలను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

- ఆటో డ్రైవర్ల సాయంతో గుర్తించిన పోలీసులు
- క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగింత

కర్నూలు క్రైం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఇంటి నుంచి తప్పిపోయిన ఇద్దరు చిన్నారులను ఆటో డ్రైవర్ల సాయంతో వెతికి పట్టుకుని క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించి అందరి ప్రశంసలు అందుకున్నారు త్రీటౌన్ పోలీసులు. మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో మారుతి మెగాసిటీలో శ్రీనిధి అపార్టుమెంటుకు చెందిన అభినవరెడ్డి (6), హరిచరణ్ (5) అనే ఇద్దరు చిన్నారులు సోమవారం ఉదయం రూ.10 నోటు తీసుకుని జామకాయలు కొనేందుకు బయటకు వచ్చారు. తిరిగి ఎంత సేపటికీ ఇంటికి రాలేదు. దీంతో వీరి తల్లిదండ్రులు ఆందోళనకు గురై పోలీసులను ఆశ్రయించారు.

డీఎస్పీ బాబు ప్రసాద్ ఆధ్వర్యంలో త్రీటౌన్ సీఐ మురళీధర్ రెడ్డి, ఎస్‌ఐ మన్మథ విజయ్ రెండు బృందాలుగా ఏర్పడి పిల్లల ఆచూకీ కోసం ఆరా తీశారు. పిల్లలకు సంబంధించిన సమాచారాన్ని పోలీసులు వాట్సాప్ గ్రూపులతో పాటు ఆటో డ్రైవర్ల వాట్సాప్ గ్రూపుల్లో చేరవేశారు. సీ.క్యాంపు చెందిన కొంతమంది మహిళలు ఈ చిన్నారులను గుర్తుపట్టి మాంటిస్సోరి స్కూల్ ఆటో డ్రైవర్లకు విషయాన్ని తెలిపారు. దీంతో ఆటో డ్రైవర్లు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు, ఆటో డ్రైవర్లు కలిసి కర్నూలు అరోరానగర్ జమ్మిచెట్టు వద్ద ఆ ఇద్దరు పిల్లలను గుర్తించారు. వారిని చేరదీసి తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిపించి అప్పగించారు. మూడు గంటల్లో కేసు ఛేదించినందుకు ఎస్పీ బిందుమాధవ్ త్రీటౌన్ పోలీసులను అభినందించారు. పోలీసులకు సహకరించిన ఆటో డ్రైవర్లు ఉపేంద్ర నాయక్, బాలరాజులను త్రీటౌన్ పోలీసులు సన్మానించి అభినందించారు.

పెళ్లికి నిరాకరించిందని ఆత్మహత్య

కర్నూలు(క్రైం), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) :

పెళ్లికి నిరాకరించిందని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన కర్నూలు పట్టణంలోని నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకున్నది. సీఐ మధుసూదన్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. నంద్యాల జిల్లా గోస్పాడు మండలం యాల్లూరు చెందిన పార్థుడు(32) లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు.

వీరి దూరపు బంధువు రేణుకా అనే మహిళ భర్త చనిపోవడంతో కల్లూరులో మారుతి నగర్‌లో నివాసం ఉంటుంది. ఆ మహిళను పెళ్లి చేసుకోవాలని పార్థుడు ప్రయత్నం చేశాడు. అయితే.. ఆ మహిళ నిరాకరించడంతో మనస్తాపానికి గురైన అతడు సోమవారం తెల్లవారుజామున సదరు మహిళ ఇంటి ముందు శరీరంపై పెట్రోలు పోసుకుని నిప్పంటి చుకున్నాడు. స్థానికులు గుర్తించి హుటా హుటిన ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. మృతుడి సోదరుడు రాజేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పీఆర్ ఈఈగా రఘురామిరెడ్డి

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి):



పంచాయతీరాజ్ శాఖ పీఐయూ విభాగం కర్నూలు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా ఎం.రఘురామిరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. జడ్పీ ఆవరణలోని కార్యాల యంలో ఆయనకు అధికారులు, ఉద్యోగులు అభినందనలు తెలిపారు. అనంతపురం జిల్లాకు చెందిన ఆయన 1992లో సర్వీసు కమిషన్ ద్వారా ఏఈగా ఉద్యోగంలో చేరారు. 2004లో డీఈగా పదోన్నతి పొం దారు. 2023లో ఈఈగా పదోన్నతి పొంది కర్నూలు సర్వశిక్ష అభియాన్‌కు వచ్చారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో కర్నూలు పీఐయూ డీఈఈగా బాధ్యతలు స్వీకరించారు.

ఫిర్యాదులను స్వీకరించిన ఎస్పీ



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ బిందు మాధవ్

కర్నూలు క్రైం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కొత్తపేటలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలో ఎస్పీ క్యాంపు కార్యాలయంలో సోమవారం ఎస్పీ జి.బిందు మాధవ్ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించారు. మొత్తం 48 ఫిర్యాదులు వచ్చాయి. దివ్యాంగుల వద్దకు నేరుగా వెళ్లి ఫిర్యాదులను స్వీకరించి న్యాయం చేస్తామని ఎస్పీ తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని ఎస్పీ జి.బిందుమాధవ్ హామీ ఇచ్చారు. సమావేశంలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి, లీగల్ అడ్వైజర్ మల్లికార్జున రావు, సీఐ శివశంకర్ పాల్గొన్నారు.

ఎస్పీ అందుకున్న ఫిర్యాదుల్లో కొన్ని..

- నేను బీటెక్ పూర్తి ఉద్యోగం కోసం ప్రయత్నం చేస్తున్నాను. తెలిసిన వ్యక్తి ద్వారా హైదరాబాదులో ఉన్న హరిప్రసాద్ రెడ్డి ఐటీసాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి రూ.2.30లక్షలు తీసుకుని మోసం చేశాడని దేవనకొండ మండలం, బేతపల్లి గ్రామానికి చెందిన శివకేశవరెడ్డి ఫిర్యాదు చేశారు.
- నా కుమారుడు, నా కోడలు ఆస్తులు రాసి ఇవ్వాలంటూ నానా రకాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ప్రాణరక్షణ కల్పించి న్యాయం చేయాలని కర్నూలు పాతబస్తీకి చెందిన జే.నరస్వతి ఫిర్యాదు చేశారు.
- నకిలీ పట్టాలు ఇచ్చి డబ్బులు తీసుకుని మోసం చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని న్యాయం చేయాలని కర్నూలు వీకర్‌సెక్షన్ కాలనీకి చెందిన వి.వెంకటేశ్వర్లు ఫిర్యాదు చేశారు.
- నన్ను కొట్టి, నా ఇంట్లోకి రానివ్వకుండా ఆస్తిని ఆక్రమించుకోవాలని మా బంధువులు బెదిరిస్తున్నారని, నాకు రావాల్సిన ఇంటి కిరాయి డబ్బులు కూడా రానివ్వకుండా చేస్తున్నారని చర్యలు తీసుకోవాలని ఆదోనికి చెందిన సంగీతబాయి ఫిర్యాదు చేశారు.
- నా దగ్గర నుంచి 59 క్వింటాళ్ల శనగలు ఉయ్యాలవాడకు చెందిన నాగేశ్వరరెడ్డి కొనుగోలు చేసి తీసుకున్నాడు. డబ్బులు ఇస్తానని చెప్పి ఇవ్వకుండా మోసం చేస్తున్నాడని ఓర్వకల్లు మండలం లొద్దిపల్లెకు చెందిన మహాదేవుడు ఫిర్యాదు చేశారు.

వైద్య ఆరోగ్య శాఖకు బదలాయించాలి



డీఆర్వోకు వినతి పత్రం ఇస్తున్న హెల్త్ సెక్రటరీలు

కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): హెల్త్ సెక్రటరీలను వైద్యఆరోగ్య శాఖకు బదలాయించాలని యునైటెడ్ విలేజ్, వార్డు హెల్త్ సెక్రటరీస్ అసోసియేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి సంధ్యారాణి, జిల్లా గౌరవాధ్యక్షుడు ఎండీ అంజిబాబు కోరారు. సోమవారం డీఆర్వో చిరంజీవికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీనియారిటీ లిస్టును తయారు చేసి ఎంపీహెచ్‌ఏ (ఎఫ్)లుగా పదోన్నతులు కల్పించాలన్నారు. వైద్యఆరోగ్య శాఖలో పని చేసే క్షేత్రస్థాయి సిబ్బందికి ఎఫ్ఆర్ఎస్ నుంచి మినహాయింపులు ఇవ్వాలని కోరారు. జీవో.నెం.152 ప్రకారం మెటర్నిటీ సెలవును డెలివరీ తేదీ నుంచి కాకుండా వారు అప్లయ్ చేసిన తేదీ నుంచి మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు మహేశ్వరి, సాయిబాబా, వరలక్ష్మి దేవి, హేమావతి, పద్మ పాల్గొన్నారు.

దూదేకుల కులస్థులు అన్ని రంగాల్లో రాణించాలి



దూదేకుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిని సన్మానిస్తున్న నాయకులు

కర్నూలు(అర్బన్), అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): దూదేకుల కులస్థులు అన్ని రంగాల్లో రాణించాలని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.మహబూబ్ బాషా అన్నారు. సోమవారం పొద్దుటూరులో రాష్ట్ర స్థాయి దూదేకుల ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉద్యోగులు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి హాజరయ్యారు. అనంతరం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సిద్ధయ్య, పలువురు ఉద్యోగులను శాలువలతో సత్కరించారు.



పుట్టగొడుగుల్లా అక్రమ లేఅవుట్లు

ల్యాండ్ కన్వర్షన్ చేయకుండా ప్లాట్ల విక్రయాలు
ప్రభుత్వ ఆదాయానికి గండి.. పట్టించుకోని అధికారులు

ఓర్వకల్లు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలో అక్రమ లేఅవుట్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. అయినా అధికారులు పట్టించుకో వడం లేదు. దీంతో ప్రభుత్వానికి లక్షల్లో గండి కొడుతున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. వ్యవసాయ భూములను కొందరు రియల్ వ్యాపారులు కొనుగోలు చేసి ప్లాట్లు వేసి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రభుత్వానికి జమ చేయాల్సిన మొత్తాన్ని చెల్లించకుండా ఖజానాకు భారీ గండి పెడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఓర్వకల్లు మండలంలో విమానాశ్రయం, సోలార్, పవర్‌గ్రిడ్, జయరాజ్ ఇస్పాత్ స్టీల్ ప్లాంట్, ఆయుధాల పరిశ్రమలు రావడంతో భూములకు రెక్కలొచ్చాయి. కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు ల్యాండ్ కన్వర్షన్ చేయించకుండా పొలాల్లోనే లేఅవుట్లు వేసి విక్రయిస్తున్నారు. వాస్తవానికి పంట భూముల్లో వెంచర్లు వేయాలంటే నాలా చట్టం ప్రకారం భూమిని కొన్న ధరల్లో 3 శాతం ల్యాండ్ కన్వర్షన్ కింద ప్రభుత్వానికి నిధులు చెల్లించాలి. అయితే అటువంటి అనుమతులు లేకుండా విచ్చలవిడిగా అక్రమ లేఅవుట్లు వేసి ప్రభుత్వానికి భారీ గండి కొడుతున్నారని ఆరోపణలున్నాయి. మండలంలోని నన్నూరు, పూడిచెర్ల, ఓర్వకల్లు, గుట్టపాడు, హుశేనాపురం, తిప్పాయపల్లె, సోమయాజులపల్లె, కాల్వబుగ్గ తదితర గ్రామాల్లో విచ్చలవిడిగా అక్రమ లేఅవుట్లు వేసి ప్లాట్లను విక్రయిస్తున్నారు. అధికారులు కూడా చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. వెంచర్‌లో రహదారులు, పార్కులు, విద్యుత్ స్తంభాలు, తదితర మౌలిక వసతులు కల్పించాల్సి ఉంది. ఇలాంటివి చేపట్టకుండా నిబంధనలకు విరుద్ధంగా ప్లాట్లు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రియల్ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పట్టించుకోని అధికారగణం

మండలంలోని వివిధ గ్రామాల్లో జాతీయ రహదారి వెంట విచ్చలవిడిగా రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్లాట్లు వేసి విక్రయిస్తున్నారు. అయితే.. అధికారులు పట్టించుకోవడం లేదు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారుల చొరవతోనే ప్రభుత్వ ఆదాయానికి రియల్టర్లు గండి కొడుతున్నారు.

- శ్రీధర్, డీవైఎఫ్ఐ నాయకుడు



జేబులు నింపుకుంటున్న రియల్టర్లు

మండలంలో విచ్చలవిడిగా ప్రభుత్వ అనుమతులు లేకుండా పట్టాభూముల్లో ప్లాట్లు వేసి రియల్టర్లు జేబులు నింపుకొంటున్నారు. ప్రభుత్వానికి లక్షల్లో గండికొడుతున్నారు. వీటిపై విచారణ చేసి కఠిన చర్యలు తీసుకోవాలి.

- గొల్ల నాగరాజు, హుశేనాపురం గ్రామం

చర్యలు తీసుకుంటాం



అక్రమ లేఅవుట్లు వేసి రియల్ ఎస్టేట్ వ్యాపారులు విక్రయిస్తున్నారు. అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా లేఅవుట్లు వేస్తున్నారని తమ దృష్టికి వచ్చింది. వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

- సుబ్బరాయుడు, ఈవోఆర్‌డీ, ఓర్వకల్లు

పల్లె పండుగను విజయవంతం చేద్దాం

టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి

కర్నూలు అర్బన్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పల్లె పండుగ కార్యక్రమాన్ని చేపట్టిందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు పి.తిక్కారెడ్డి అన్నారు. సోమవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ బీటీ నాయుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి వై.నాగేశ్వరరావు యాదవ్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ.4,500 కోట్ల నిధులతో 30 వేల పనులకు గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గత వైసీపీ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధిని విస్మరించిందన్నారు. 14, 15 ఫైనాన్స్ కమిషన్ నిధులను అప్పటి సీఎం జగన్ మోహన్ రెడ్డి దారిమళ్లించి అభివృద్ధిని ధ్వంసం చేశాడన్నారు. వాల్మీకి జయంతిని ప్రభుత్వ పరంగా నిర్వహించేందుకు ఆదేశాలిచ్చిన సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈనెల 17న చేపట్టబోయే కార్యక్రమాన్ని వాల్మీకులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

గ్రామాలను నందనవనంగా తీర్చిదిద్దుతాం : ఎమ్మెల్యే

ఓర్వకల్లు: గ్రామాలను నందనవనంగా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా సోమవారం ఓర్వకల్లులో రూ.20లక్షలతో సిమెంటు రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేసి పనులను ఆమె ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.4,500 కోట్ల నిధులతో 30వేల పనులు మంజూరు చేశామన్నారు. 8 లక్షల కుటుంబాలకు వంద రోజుల పనిదినాలు, 3వేల కి.మీల మేర సిమెంటు రోడ్డు నిర్మాణం, 500 కి.మీల మేర బీటీ రోడ్ల నిర్మాణం, 2,500 గోకులాల షెడ్లు, వేయి ఎకరాల్లో నీటి సంరక్షణ ట్రెంచులు మంజూరు చేశామన్నారు. ఓర్వకల్లు గ్రామానికి రూ.50లక్షలు మంజూరు కాగా, సిమెంటు రోడ్లు, గ్రావెల్స్ రోడ్లు తదితర పనులు చేపట్టబోతున్నామన్నారు. మండలానికి 37 పనులకు గానూ రూ.2 కోట్లు ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా నిధులు మంజూరు చేశామన్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ డీఈ నాగిరెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసులు, తహసీల్దార్ విద్యాసాగర్, ఏఈలు సురేంద్రనాథ్ రెడ్డి, శ్రీనివాసులు, ఏపీవో కుమార సాయినాథ్, ఈవోఆర్‌డీ సుబ్బరాయుడు, ఎంఈవో ఓంకార్ యాదవ్, ఎస్ఐ సునీల్ కుమార్, నాయకులు గోవింద రెడ్డి, విశ్వేశ్వరరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, భాస్కర్ రెడ్డి, అన్వర్ బాషా, మౌలీశ్వర రెడ్డి, అబ్దుల్లా, శోభన్‌బాబు, ఆనంద్, సంజీవరాజు, ఏసేపు, నాగరాజు పాల్గొన్నారు.

గూడూరు: మండలంలోని కె నాగలా పురం గ్రామంలో పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. సోమవారం కె నాగలాపురంలో పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాల కార్యక్రమం నిర్వహించగా సర్పంచ్ జె నయోమి, ఎంపీడీవో శివనాగప్రసాద్ పాల్గొన్నారు. ఇందులో భాగంగా రూ.1.20లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి, రూ.1.15లక్షలతో మీని గోకులం నిర్మాణానికి భూమి పూజ చేశారు.

సి.బెళగల్: పంచాయతీల అభివృద్ధే పల్లె పండుగ లక్ష్యమని ఎంపీడీవో రాణెమ్మ అన్నారు. సోమవారం మండలంలోని బ్రాహ్మణదొడ్డి, మారందొడ్డి గ్రామ పంచాయతీల్లో సర్పంచుల దస్తగిరి, శాంతమ్మల ఆధ్వర్యంలో పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఏపీవో రామన్న మాట్లాడుతూ పంచాయతీలలో ఉపాధి హామీ పథకంలో భాగంగా కాలువల పూడిక తీత, పండ్లతోటలు, ఇంకుడు గుంతలు, ఫారంపండ్సు, పశువుల షెడ్డునిర్మాణాలకు రూ.80 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. అనంతరం పీఆర్ ఏఈ వెంకట్ ప్రకాశ్ మాట్లాడుతూ మారందొడ్డి గ్రామంలో సీసీ రోడ్లు నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. ఈసమావేశంలో ఈసీ రంగస్వామి, హార్టికల్చర్ అధికారి చెంచురాజు, సూపరింటెండెంట్ శ్రీనివాసులు, వీఆర్వో మంజీరా, టెక్నికల్ అసిస్టెంట్ రాజశేఖర్, టీడీపీ నాయకులు లక్ష్మన్న, జిక్రియ, సోమన్న పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి



ఓర్వకల్లులో సిమెంటు రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత

ప్రజలకు అందుబాటులో ఉండాలి

సి.బెళగల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపీడీవో రాణెమ్మ అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామ పంచాయతీలలో నిర్వహించే పల్లె పండుగ కార్యక్రమానికి గైర్హాజరైతే చర్యలు తప్పవని ఎంపీడీవో హెచ్చరించారు. ఈసమావేశంలో ఏపీవో రామన్న, ఈసీ రంగస్వామి, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేస్తే చర్యలు

సి.బెళగల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చేస్తే చర్యలు తీసుకుంటామని మండల విద్యాధికారి జ్యోతి హెచ్చరించారు. సోమవారం మండలంలోని పోలకల్లు గ్రామ పంచాయతీలో గ్రామ సర్పంచ్ మాదక్క ఆధ్వర్యంలో మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మండల విద్యాధికారి జ్యోతి మాట్లాడుతూ బాల్యవివాహాలపై మండలంలో ప్రత్యేక టీమును ఏర్పాటు చేశామన్నారు.

సమస్యలు పరిష్కరించాలి: ఎమ్మెల్యే

ఓర్వకల్లు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన సమస్యలను అధికారులు వెంటనే పరష్కరించాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అధికారులు వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ బాధితులను కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా తక్షణమే సమస్యలను పరిష్కరించాలన్నారు. భూ సమస్యలు, పింఛన్లు, ఆలయ భూముల ఆక్రమణ, అక్రమ మట్టి తవ్వకాలు, రేషన్ కార్డులు, ఇంటి స్థలాలు, పక్కా గృహాలపై వినతులు వచ్చాయి. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసులు, తహసీల్దార్ విద్యాసాగర్, జడ్పీటీసీ రంగనాథగౌడు, ఎంపీపీ తిప్పన్న, ఏపీవో కుమార సాయినాథ్, ఏఈలు సురేంద్రనాథ్ రెడ్డి, శ్రీనివాసులు ఈవోఆర్‌డీ సుబ్బరాయుడు, ఎంఈవో ఓంకార్ యాదవ్, టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, నాయకులు విశ్వేశ్వరరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, భాస్కర్ రెడ్డి, మండలంలోని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

● **అధికారులు అప్రమత్తంగా ఉండాలి:** జిల్లాలో ఈనెల 16వ తేదీ వరకు భారీ వర్షాలు పడే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిందని, ఈ నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత విజ్ఞప్తి చేశారు. పాణ్యం నియోజకవర్గంలోని పాణ్యం, గడివేముల, ఓర్వకల్లు, కల్లూరు మండలాల అధికారులతో పాటు ప్రజలు, రైతులు అందరూ అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

ఆరు నెలల బాబు కిడ్నీలో రాళ్లు

ఎండోస్కోపిక్ ద్వారా తొలగించిన కిమ్స్ వైద్యులు

కర్నూలు(హాస్పిటల్), అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): చిన్న పిల్లలకు అవయవాలు చాలా చిన్నవిగా ఉంటాయి. అలాంటి ఆరు నెలల బాబుకు కిడ్నీలో రాళ్లు పెద్ద సైజులో ఉండటం ఇబ్బందికరమే. నంద్యాల జిల్లా పాణ్యంకు చెందిన ఆరు నెలలల చిన్నారికి కుడి కిడ్నీలో రెండు, ఎడమ కిడ్నీలో రెండు రాళ్లు ఉండటంతో బాబుకు పొట్ట ఉబ్బి మూత్ర విసర్జన ఆగిపోయింది. చిన్నారి తండ్రి ఆర్మీలో పని చేస్తుండటంతో తల్లి భారతి, మేనమామ ఈనెల 5వ తేదీ బాబుని కర్నూలు కిమ్స్ ఆస్పత్రికి తీసుకునిరాగా యురాలజిస్టు డాక్టర్ మనోజ్‌కుమార్ పరీక్షలు నిర్వహించారు. కుడి వైపున కిడ్నీలో 9మిల్లీ లీటర్లు, 7మిల్లిలీటర్లు ఎడమ వైపున 11 మిల్లీలీటర్లు, 9 మిల్లీ లీటర్లు చొప్పున రాళ్లు ఉన్నట్లు గుర్తించారు. ముందుగా డాక్టర్ మనోజ్‌కుమార్ స్టెంట్లు అమర్చి కిడ్నీలను సాధారణ పరిస్థితికి తెచ్చారు. ఆ తర్వాత ఒక వైపు కిడ్నీకి ఒక్కసారి రెండో వైపు కిడ్నీకి ఇంకోసారి ఎండోస్కోపిక్ పద్ధతిలో కుట్లు లేకుండా లేజర్ ద్వారా అవయవాలకు గాయాలు కాకుండా రాళ్లను తొలగించారు. ఆ తర్వాత డాక్టర్ మనోజ్‌కుమార్ స్టెంట్లను తొలగించారు.

నగర పాలకలో కమాండ్ కంట్రోల్ రూమ్

కర్నూలు(న్యూసిటీ), అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా మూడు రోజులపాటు రాయలసీమలో విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించడంతో నగర పాలక అధికారులు ప్రత్యేకంగా కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ఈ కమాండ్ కంట్రోల్ రూమ్ అందుబాటులో ఉంటుందని కమిషనర్ రవీంద్రబాబు పేర్కొన్నారు. తుఫాన్‌కు సంబంధించి ఏదైనా సమస్య ఉంటే 7422992299కు ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు.

ట్యాప్ ఇన్‌స్పెక్టర్‌కు మెమో

కర్నూలు(న్యూసిటీ), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ పరిధిలో పని చేస్తున్న ట్యాప్ ఇన్‌స్పెక్టర్ వెంకట్రాముడు విధుల్లో నిర్లక్ష్యం వహించినందుకు ఎస్ఈ రాజశేఖర్ మెమో జారీ చేశారు. ఈ మేరకు కల్లూరు పరిధిలో నీటి సరఫరాపై ప్రజలు ఫిర్యాదు చేయడంతో ఆయనకు మెమో జారీ చేశారు. ఈ మెమోపై మూడు రోజుల్లో వివరణ ఇవ్వకపోతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని మెమోలో పేర్కొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ఓర్వకల్లు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని హుశేనాపురం జాతీయ రహదారిపై సోమవారం మిడుతూరు మండలం నాగలూటి గ్రామానికి చెందిన వడ్డె వల్లపు రామాంజనేయులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఆయన జీవితంపై విరక్తి చెంది బ్లేడుతో గొంతు కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన ప్రయాణికులు పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో స్పందించిన పోలీసులు చికిత్స నిమిత్తం రామాంజనేయులును ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



డీఐజీని కలిసిన విష్ణువర్ధన్‌రెడ్డి



డీఐజీని శాలువతో సత్కరిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

కర్నూలు రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): బీ.క్యాంపులో కర్నూలు రేంజ్ డీఐజీ కె.ప్రవీణ్‌కుమార్‌ని సోమవారం టీడీపీ సీనియర్ నాయకుడు ఎదురూరు విష్ణువర్ధన్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా క్యాంపు కార్యాలయంలో డీఐజీకి విష్ణు పూలబొకె ఇచ్చి శాలువ కప్పి ఘనంగా సత్కరించారు. అనంతరం కోడుమూరు నియోజకవర్గంలో నెలకొన్న పలు సమస్యలను విష్ణువర్ధన్‌రెడ్డి డీఐజీ దృష్టికి తీసుకెళ్లారు.

దేవీ నవరాత్రుల ముగింపు వేడుకలు

కల్లూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): దేవీ నవరాత్రి మహోత్సవంలో భాగంగా సూర్యనారాయణస్వామి ఆలయంలో ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించారు. సోమవారం ఆలయ ట్రస్టీ టి.శివరామకృష్ణ ఆధ్వర్యంలో ఉదయం కలశద్వాసన జరిపి అమ్మవారికి మేరు శ్రీచక్రానికి షోడశోపచార పూజ, 108 అష్టోత్తర శత కళాభిషేకం, లలితా సహస్ర నామ పారాయణం, అభిషేకం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

రహదారిని బాగు చేయండి

గూడూరు అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గూడూరు నగర పంచాయతీ పరిధిలోని తూర్పు బీసీ కాలనీలో గుంతలమయంగా మారిన రహదారిని బాగు చేయాలని వైస్ ఛైర్మన్ లక్ష్మన్న, గౌండ రాజు కోరారు. సోమవారం గూడూరు నగర పంచాయతీ కార్యాలయంలో కమిషనర్ నాగరాజుకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గూడూరు నగర పంచా యతీ పరిధిలోని తూర్పు బీసీ కాలనీలో ప్రధాన రహదారి గుంతలమయంగా మారి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు దృష్టి సారించి రహదారిని బాగు చేయాలన్నారు.

కాంట్రాక్టు లెక్చరర్లను క్రమబద్ధీకరించాలి



ఎంపీకి వినతి పత్రం ఇస్తున్న నాయకులు

కర్నూలు ఎడ్యుకేషన్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పని చేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లను క్రమబద్ధీక రించాలని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజుకు ఏపీజీజేసీసీఎల్ఏ నాయకులు సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో 3618 మంది కాంట్రాక్టు లెక్చరర్లు పని చేస్తున్నారని అన్నారు. 2014లో ప్రభుత్వం అధికారంలోకి రాగానే కాంట్రాక్టు లెక్చరర్ల క్రమబద్ధీకరణకు చర్యలు చేపట్టి మంత్రివర్గ ఉప సంఘాన్ని నియమించారన్నారు. అయితే చివరి దశలో అధికారుల సాంకేతిక కారణాలను సాకుగా చూపి ఎటూ తేల్చకుండా వదిలే శారన్నారు. 2019లో వైసీపీ ప్రభుత్వం క్రమబద్ధీకరణ చేస్తామని అధికారం లోకి వచ్చి అన్ని రకాలైన ఉత్తర్వులు జారీ చేసి చివరకు మొండి చేయి చూపించిందన్నారు. తెలంగాణ కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులర్ చేసి రెండేళ్లు పూర్తి కావస్తుందన్నారు. ఎన్డీయే ప్రభుత్వం క్రమబద్ధీకరణ చేసి వారి కుటుంబాల్లో వెలుగులు నింపాలని కోరారు. ఎంపీని కలిసిన వారిలో నాయకులు బ్రహ్మేశ్వర్లు, రంగస్వామి, ఓబులేసు, ప్రేమ్‌కుమార్, రామాంజనేయులు, నూర్ అహ్మద్, చాంద్‌బాషా ఉన్నారు.

గ్రామీణ రహదారులకు మహర్దశ

కల్లూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కూటమి ప్రభుత్వంలో గ్రామీణ దహదారులకు మహర్దశ రానుందని కల్లూరు మండల స్పెషల్ ఆఫీసర్ దీప్తి, ఎంపీడీఓ జి.నాగశేషాచల రెడ్డి అన్నారు. పల్లె పండుగ పంచాయితీ వారోత్సవాల్లో భాగంగా సోమవారం ఉలిందకొండ, ఎర్రకత్వ, కేపీ.తాండ, యాపర్లపాడు గ్రామాల్లో ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా చేపట్టనున్న అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఏపీ ఫైనాన్స్ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ డి.రామాంజనేయులు, ఉలిందకొండ టీడీపీ నాయకుడు ఈవీ.రమణ, రంగస్వామిరెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా దీప్తి, జీఎన్ఎస్.రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం గ్రామీణ రహదారుల అభివృద్ధికి ప్రత్యేక రూట్‌మ్యాప్ ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించారన్నారు ఉలిందకొండలో రూ.20 లక్షలతో సీసీ రోడ్లు, ఎర్రకత్వలో రూ.5, కేపీ తాండలో రూ. 5లక్షలతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. అలాగే యాపర్ల పాడులో రూ.5 లక్షలతో సీసీ రోడ్లు ప్రారంభించినట్లు ప్రత్యేక అధికారి దీప్తి, ఎంపీడీఓ జి.నాగశేషాచలరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ నగేష్, ఏఈ పీఆర్.రవిమోహన్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సతీష్ పాల్గొన్నారు.

వాట్సాప్ మెసేజ్‌కు స్పందించిన సూపరింటెండెంట్

● గైనిక్ 7వ యూనిట్‌లో కొత్తగా 8 ఫ్యాన్లు ఏర్పాటు

కర్నూలు(హాస్పిటల్), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గైనిక్ 7వ యూనిట్‌లో చికిత్స పొందుతున్న ఓ బాలింత బంధువు పెట్టిన వాట్సాప్ మెసేజ్‌కు కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్ రెడ్డి స్పందించారు. విజయకుమారి అనే గర్భిణి ఈ నెల 9వ తేదీ లేబర్ రూమ్‌లో డెలివరీ అయింది. దీంతో వైద్యులు బాలింతను గ్రౌండ్‌ఫ్లోర్ నుంచి 7వ యూనిట్ వార్డు ఉన్న మూడవ ఫ్లోర్‌కు షిఫ్ట్ చేశారు. అక్కడ 7వ వార్డులో 8 ఫ్యాన్లు పని చేయడం లేదని, మంచాల కొరత ఉందని, బాలింతలు తీవ్ర ఉక్కపోతతో అల్లాడిపోతున్నారని, న్యాయం చేయాలని వాట్సాప్ ద్వారా వీడియోలు పంపుతూ మెసేజ్ పెట్టింది. దీనిపై సూపరింటెండెంట్ స్పందించారు. అక్కడ ఫ్యాన్లు ఎన్ని పని చేస్తున్నాయో నివేదిక తెప్పించుకుని వెంటనే 8 కొత్త ఫ్యాన్లు వేయాలని ఎలక్ట్రీషియన్లను ఆదేశించారు. సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు సిబ్బంది 8 కొత్త ఫ్యాన్లను అమర్చారు. దీంతో ఫిర్యాదు చేసిన బాలింత విజయకుమారి బంధువు సూపరింటెండెంట్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ మెసేజ్ పెట్టింది.

వైద్యశాఖలో 13 పాత వాహనాలకు ఈ-వేలం: జిల్లా వైద్యఆరోగ్య శాఖ పరిధిలో కాల పరిమితి దాటిన 13 వాహనాలకు ఏపీ కొనుగోలు పోర్టల్ ద్వారా ఈ-వేలం నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ ఎల్. భాస్కర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25వ తేదీన 13 వాహనాల స్క్రాప్ కింద వేలం వేస్తారన్నారు.

ఆంధ్రజ్యోతి
ఆదోని
మంగళవారం 15 అక్టోబరు 2024

హొళగుంద తహసీల్దార్‌గా సతీష్



హొళగుంద, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): తహసీల్దార్‌గా సతీష్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. పత్తికొండ ఆర్డీవో కార్యాలయ ఏవోగా పనిచేసి బదిలీపై ఇక్కడకు వచ్చినట్లు తెలిపారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ప్రసాద్ రాజు పత్తికొండ ఆర్డీవో కార్యాలయానికి వెళ్లారు.

సమస్యల పరిష్కారమే టీడీపీ ధ్యేయం



అమీనాబాదులో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న తుగ్గలి నాగేంద్ర, అధికారులు

తుగ్గలి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించడమే టీడీపీ ధ్యేయమని ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర అన్నారు. సోమవారం మండలంలోని జి.ఎర్రగుడి, పగిడిరాయి, అమీనాబాద్ గ్రామాల్లో ఆయన ఎంపీడీవో విశ్వమోహన్‌తో కలిసి పల్లెపండుగ నిర్వహించారు. పంచాయతీ తీర్మానాల మేరకు సీసీ రోడ్ల నిర్మాణాలకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా తుగ్గలి నాగేంద్ర మాట్లాడుతూ మండలాన్ని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు సహకారంతో అభివృద్ధి పథంలో నడుపుతామన్నారు. టీడీపీ ప్రభుత్వం వచ్చిన మూడు నెలల్లోనే గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టామని, మున్ముందు ఇంకా అభివృద్ధి పనులు చేస్తామన్నారు. చంద్రశేఖర్ యాదవ్, ఈశ్వర్ రెడ్డి, తిమ్మయ్య చౌదరి, శివరాముడు చౌదరి, సర్పంచ్ విజయలక్ష్మి, ఏపీవో హేమ్ కుమార్, మధుబాబు, కొమ్మెవెంకటేశ్, లింగమయ్య, సత్యప్రకాష్, సతీష్, మల్లికార్జున, రాము, రంగారెడ్డి, మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూమి ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలి

ఆదోని అగ్రికల్చర్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలం సర్వేనెంబర్ 148ఏ లోని 18 ఎకరాల సాగు భూమిని ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ కార్యవర్గ సభ్యుడు భాస్కర్ యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజకు వినతిపత్రం అందజేశారు. మస్తాన్ సాబ్ అనే వ్యక్తి కుటుంబ సభ్యులు వలస వెళ్లడంతో వారసత్వ భూమిని ఆక్రమించి, ఆన్‌లైన్‌లో తమ పేర్లు మార్చించుకున్నారన్నారు. వారిపై చర్యలు తీసుకొని తమ భూమిని అప్పజెప్పాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మణ్ నాయక్, గోపాల్, సుదర్శన్, సులేమాన్, షేక్ రజాక్, సుకుర్ పాల్గొన్నారు.

నేడు, రేపు జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

దేవనకొండ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో ఉరుసు సందర్భంగా 16,17 తేదీల్లో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఐరన్‌బండ, బి.సెంటర్ గ్రామస్తులు సోమవారం తెలిపారు. పాల్గొనే జట్లు రూ.500 రుసుము చెల్లించాలని కోరారు.

నేడు గొలుసు తెంపు ఉత్సవం

హొళగుంద, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): దేవరగట్టు బన్ని ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం శివసనం కట్ట వద్ద గొలుసు త్రెంపు ఉత్సవం నిర్వహిస్తున్నారు. హాలహర్వి మండల బాల్లూరుకు చెందిన గొరవయ్య చేసే ప్రదర్శనను చూసేందుకు భక్తులు వస్తారు. గొరవయ్యల నృత్యం, సాయంత్రం దేవదాసీల క్రీడలు, వసంతోత్సవం వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఆలూరు సీఐ శ్రీనివాస్ నాయక్, హొళగుంద ఎస్‌ఐ బాలనరసింహులు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

సంపద సృష్టి కూటమి ధ్యేయం

దేవనకొండ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): సంపదను సృష్టించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయని ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ అన్నారు. పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా దేవనకొండ ,కుంకనూరు గ్రామాల్ల సీసీ రోడ్లు, మేకలు, కోళ్ల, మినీ గోకులం షెడ్ల అభివృద్ధి పనుల ను పత్తికొండ ఆర్డీవో భరత్ నాయక్‌తో కలసి ప్రారంభించారు. జనసేన వెంకప్ప, రంగన్న, మలకన్న, సుభాన్,ఆకుల సిద్ధ ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు, పీఆర్ డీఈ మనోహర్, తహసీల్దార్ లోకేష్ ,ఈవోఆర్డీ సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



పనులను ప్రారంభిస్తున్న వీరభద్రగౌడ్

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



అరికేరలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ కుప్పగల్ నాగరాజు

ఆలూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : గ్రామల అభివృద్దే ప్రభుత్వ లక్ష్యమని ఇన్‌చార్జి ఎంపిడివో రమాదేవి అన్నారు. సోమవారం ఆలూరు మండలంలో పల్లె పండుగ కార్యక్రం నిర్వహించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ.10లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ కుప్పగల్ నాగరాజుతో కలిసి ప్రారంభించారు. అనంతరం అరికేర తండాలో రూ.5లక్షలుతో సీసీ రోడ్డు పనులను ఆరంభించారు. ఆలూరు మండలంలో రూ.2కోట్ల నిధులతో గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, మొక్కల పెంపకం కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. పీఆర్ జేఈ చౌడరెడ్డి, ఏపీవో శ్రీనివాసులు, ఉప సర్పంచ్ లక్ష్మి, నారాయణ, పంచాయతీ కార్యదర్శి హుల్తెప్ప, టీడీపీ నాయకులు మల్లేశ, మల్లప్ప, శేఖన్న, గోవిందు, ఈసీ మారన్న, టెక్నికల్ అసిస్టెంట్ శర్మష్ వలి పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించండి : ఆర్డీవో

పత్తికొండ, అక్టోబరు 14 (ఆంధ్ర జ్యోతి): ప్రజాసమస్యలను పరిష్కరించడానికే పనిచేయాలని ఆర్డీవో భరత్‌నాయక్ తహసీల్దార్లకు సూచించారు. కొద్ది రోజుల క్రితం బదిలీపై పత్తికొండకు వచ్చిన ఆయన డివిజన్ తహసీ ల్దార్లతో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. రెవెన్యూ విభాగంలో ప్రభుత్వం తెచ్చిన మార్పులకు అనుగుణంగా పనిచేయాలని సూచించారు.



మాట్లాడుతున్న ఆర్డీవో భరత్ నాయక్

బకాయిలు చెల్లించాలి : ఎస్టీయూ



మాట్లాడుతున్న ఎస్‌టీయూ పట్టణ అధ్యక్షుడు రవి

ఆదోని (అగ్రికల్చర్), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ ఉపాధ్యాయులకు పెండింగ్ ఉన్న బకాయిలను వెంటనే చెల్లించాలని ఎస్‌టీయూ పట్టణ అధ్యక్షుడు రవి డిమాండ్ చేశారు. సోమవారం నెహ్రూ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఉద్యోగులు దాచుకున్న పీఎఫ్, ఏపీజీ ఎల్ఐ, సంపాదిత సెలవుల డబ్బులు ప్రభుత్వం చెల్లించకుండా జాప్యం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పీఆర్సీ ఆలస్యం అవుతుందని వెంటనే 30 శాతం ఐఆర్ ప్రకటించాలన్నారు. బోధనకు ఆటంకంగా ఉన్న యాప్‌లను రద్దు చేయాలన్నారు. లోక్యా నాయక్, నాగరాజు, వీరచంద్ర యాదవ్, ప్రహల్లాద, సుధాకర్ బాబు, ఖలీల్ జుబేద్, ప్రసాద్, విజయ్, ఉరుకుందప్ప, మారయ్య పాల్గొన్నారు.

రైతుకు తిప్పలు



- మంజూరు కాని పట్టాదారు పాసు పుస్తకాలు
- రైతులతో అధికారుల ఆటలు
- మండలంలో 650పైగా దరఖాస్తులు

మద్దికెర, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం రీ సర్వే పేరుతో పట్టాదార్ పాసుపుస్తకాలను రద్దుచేసింది. కొత్తవాటిని మంజూరు చేస్తామని చెప్పింది. ఇంతలో ప్రభుత్వం మారింది. రీ సర్వేను రద్దుచేసినా పాసు పుస్తకాలు ఇవ్వలేదు. దీంతో రైతులు తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ చెప్పులరిగేలా తిరుగుతున్నారు. పాసు పుస్తకాలు లేక బ్యాంకు రుణాలు మంజూరు కావడంలేదు. మండలంలోని బురుజుల, హంపా, కొత్తపల్లి, బొమ్మనపల్లి, ఎం.అగ్రహారం గ్రామానికి చెందిన రైతులు 650 మందికి పైగా పట్టాదారు పాసు పుస్తకాల కోసం దరఖాస్తు చేసుకున్నారు.

ఆరు నెలల నుంచి ప్రదక్షిణలు..

పట్టాదారు పాసు పుస్తకాలకు దరఖాస్తు చేసిన రైతులు ఆరు నెలల నుంచి తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షి ణలు చేస్తున్నారు. ఇంతవరకు పట్టించుకున్న వారు లేదు. పాసు పుస్తకం లేక బ్యాంకు రుణాలు అందడం లేదు.

వారసత్వంగా వచ్చేవి అంతే..!

తల్లిద్రండుల నుంచి వచ్చే భూముల విషయంలో కూడా ఇలాగే సాగుతోంది. ఇలాంటి ఎ మండలంలో 30 వరకు పెండింగ్ ఉన్నాయి. ఎన్నిసార్లు విన్నవించుకున్నా స్పందించేవారు లేని రైతులు వాపోతున్నారు. రెవెన్యూ అధికారులు కులం, ఆదాయ ధ్రువీకరణ ప్రతమే ఇస్తామని ఇస్తామని చెబుతున్నారు.

హామీ బుట్టదాఖలు

సరైన డాక్యుమెంట్లు ఉంటే, దరఖాస్తు చేసిన నెలలోపే పట్టాదార్ పాసు పుస్తకాలు మంజూరు చేస్తామన్న హామీ బుట్ట దాఖలైంది. రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు ఉన్నా పట్టించుకునేవారు లేరని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి పాసు పుస్తకాలు ఇవ్వాలని కోరుతున్నారు

విధి విధానాలు రాలేదు



ప్రభుత్వం రీసర్వే జీవోను రద్దు చేసింది. పాసు పుస్తకాల మంజూరుకు అయితే విధి వినాలు ఇంకా రాలేదు. దీంతో పుస్తకాలు పెండింగ్‌లో పడ్డాయి.
- హుశేన్‌సాహెబ్, తహసీల్దార్

ఓట్లేయని వారు వెంట తిరుగుతున్నారు..



బైచిగేరి సర్పంచుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

- ఎమ్మెల్యేను నిలదీసిన వృద్ధురాలు
- సర్పంచ్‌పై పరుష పదజాలంతో ఎమ్మెల్యే ఆగ్రహం

ఆదోని రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తాము టీడీపీ కార్యకర్తలమని వైసీపీ వాళ్ల పింఛన్ రాకుండా చేశారు. ఇప్పుడేమో ఓట్లు వేయనివారిని (వైసీపీ) వెంట తిప్పుకుంటున్నారని దళిత వృద్ధురాలు ప్రమీలమ్మ ఎమ్మెల్యే పార్థసారథిని నిలదీసింది. పల్లెపండుగలో భాగంగా ఎమ్మెల్యే ఆదోని మండలం బైచిగేరిలో సోమవారం పర్యటించారు. ఎమ్మెల్యే గ్రామలోని ఇళ్లవద్దకు వెళ్లి పలకరించాడు. ఈ క్రమంలో తమ ఇంటి వద్ద డ్రైనేజీ, రోడ్డు లేదని తెలుగు ఆంజనేయ ఎమ్మెల్యేను నిలదీశాడు. స్పందించిన ఎమ్మెల్యే రోడ్డు వేయాలి కదరా అంటూ సర్పంచ్ మహదేవాపై ఎమ్మెల్యే పరుష పదజాలాన్ని ఉపయోగించాడు. గ్రామ ప్రథమ పౌరుడు సర్పంచును ఇలా అనడం ఏంటని అనుచరులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం రూ. 6లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే శంఖుస్థాపన చేశారు.

మిరప పంట తొలగించారు

ఆదోని రూరల్ అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి):

తన పొలంలో వేసిన మిరప పంటను తొలగించారని ఆదోని మండలం పెద్దహరివాణం గ్రామానికి చెందిన రైతు కృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. ఎకరా పొలంలో మిరప సాగు చేశానని గుర్తు తెలియని వ్యక్తులు పంటను తొలగించి కుప్ప వేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఇస్వి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఇద్దరి అరెస్టు

ఆదోని రూరల్ అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి):

కర్ణాటక మద్యం తరలిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ నాగేంద్ర తెలిపారు. వివరాల మేరకు.. ఆదోని పట్టణానికి చెందిన శ్రీనివాసులు, గిడ్డయ్య కర్ణాటక మద్యంను తరలిస్తుండగా పెద్దహరివాణం గ్రామ శివారుల్లో అదుపులోకి తీసుకుని, 150 మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నిబంధనల మేరకే ప్లాన్లు వేయాలి

ఆదోని టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నిబంధనల మేరకే ప్లాన్లు వేయాలని మునిసిపల్ ఏసీపీ కృష్ణ సింగ్ అన్నారు. సోమవారం ఎల్టీఈపీలు బదిలీపై వచ్చిన అసిస్టెంట్ సిటీ ప్లానర్ కృష్ణ సింగ్‌ను కలిసి సన్మానించారు. ఆయన మాట్లాడుతూ, కొత్తగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లో ప్లాను అనుమతి లేకుండా నిర్మాణాలను ప్రోత్సహించవద్దని సూచించారు. పట్టణ అభివృద్ధికి అందరూ సహకరించాలన్నారు. రంగ స్వామి, విజేంద్రనాథ్ ప్రసాద్, చంద్ర, అది, అల్లాఉద్దీన్, రమేష్, రవి, అరుణ్ పాల్గొన్నారు.

మనో వేదనతో రైతు మృతి

ఆస్పరి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : అప్పుల బాధ తేలలేక మనోవేదనకు గురైన రైతు బోయ భీమన్న (41) మృతి చెందాడు. వివరాల మేరకు.. కైరుప్పల గ్రామానికి చెందినగ భీమన్న పొలాన్ని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. పంటలు సరిగా పండక అప్పులయ్యాయి. వీటిని ఎలా తీర్చాలోనని ప్రతి రోజు మనోవేదనకు గురయ్యేవాడు. సోమవారం రాత్రి గ్రామ సమీపంలోని రంగస్వామి ఆలయంలో రాత్రి నిద్రించడానికి వెళ్లి ఉదయం ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా అప్పటికే మృతి చెందాడు. మృతుడికి భార్య బోయ అంజనమ్మ కూతుర్లు వీణ, ఉష ఉన్నారు. కుటుంబ సభ్యులను టీడీపీ నాయకులు వరప్రసాద్, శేషరెడ్డి, రామకృష్ణ, వీరేష్, బసవరాజు పరామర్శించి రూ.7వేలు కుటుంబ సభ్యులకు అందించారు.

పల్లెలకు మహర్దశ

మద్దికెర, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పల్లె పండుగతో పల్లెలకు మహర్దశ వస్తుందని ఎంపీడీవో కొండయ్య, ఏపీవో నర్సిరెడ్డి, పత్తికొండ మార్కెట్ యార్డు డైరెక్టర్ శ్రీనివాసులు, టీడీపీ నాయకులు సంజప్ప అన్నారు. సోమవారం మండలంలోని మదనంతపురం గ్రామంలో పల్లె పండుగ పంచాయితీ వారోత్సవాల్లో భాగంగా ఉపాధి హామీ నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డుకు భూమి పూజ చేశారు.

తెలుగు తమ్ముళ్ల గొడవ



మదనంతపురం గ్రామంలో గొడవ పడుతున్న నాయకులు

- ప్రాధాన్యమివ్వడం లేదని ఒక వర్గం వాగ్వాదం

మద్దికెర, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మదనంతపురం గ్రామంలో పల్లె పండుగలో సోమవారం తెలుగు తమ్ముళ్ల గొడవ పడ్డారు. అధికారులు, టీడీపీ నాయకులు సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేసేందుకు వచ్చారు. అయితే.. గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు ప్రసాద్, హనుమంతు అధికారులు, స్థానిక పార్టీ నాయకుడు పత్తికొండ మాజీ మార్కెట్ యార్డు డైరెక్టర్ శ్రీనివాసులు, సంజప్పతో వాగ్వాదానికి దిగారు. గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్, రేషన్ షాపు డీలర్లు మధ్యాహ్న భోజనం అన్ని మీ అనుచరులకే కేటాయిస్తే ఇక మేమెందుకు పార్టీలో ఉండాలంటూ ప్రశ్నించారు. మేము కూడా పార్టీ కోసం కష్టపడి పని చేసినా ఎలాంటి సమాచారం కూడా ఇవ్వకుండా రోడ్డు ఎలా వేస్తారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీనివాసులు, సంజప్ప తమను కలుపుకుని వస్తే తాము కూడా సహకరిస్తామని సర్దిచెప్పినా గొడవ సద్దుమణగలేదు. దీంతో అధికారులు, కార్యకర్తలు కిమ్మనకుండా ఉండిపోయారు. పార్టీలో వర్గపోరు రోజురోజుకు ఎక్కువవుతోందని, పెరవలి, మద్దికెర గ్రామాల్లో కూడా విభేధాలు తారస్థాయికి చేరుకున్నట్లు తెలుస్తోంది. నాయకులు విభేదాలు పక్కనపెట్టి గ్రామాలను అభివృద్ధి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

అసాంఘిక కార్యాలపై ఉక్కుపాదం

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- 300 సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రతిపాదనలు
- ఆదోని డీఎస్పీ సోమన్న



ఆదోని, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): అసాంఘిక కార్యాలపై ఉక్కుపాదం మోపుతామని ఆదోని డీఎస్పీ సోమన్న హెచ్చరించారు. సోమవారం ఆంధ్రజ్యోతికి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

ప్ర: చోరీలకు ఎలా అడ్డుకట్టు వేస్తారు.?

జ: ఆదోనిలో 300 సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. ఇటీవల చోరీలు అధికంగానే జరిగాయి. వాటిని ఛేదించేందుకు ప్రత్యేక ప్రణాళిక రచించాం. ఆదోనిలో ఇటీవల జరిగిన చోరీలుపైన సిబ్బంది పూర్తిస్థాయిలో పనిచేస్తూ దొంగలను పట్టుకునేందుకు కృషి చేస్తున్నారు. సీఐలు, ఎస్‌ఐలు శక్తి వంచన లేకుండా పనిచేస్తున్నారు. రాత్రి సమయాల్లో గస్తీ మరింత పెంచేందుకు చర్యలు చేపట్టి, నిరంతర నిఘా ఏర్పాటు చేశాం.

ప్ర: ఆదోనిలో గంజాయి నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.?

జ: పట్టణంలో గంజాయి జాడలు ఉన్నట్లు సమాచారం ఉంది. దీనిపై ప్రత్యేక నిఘా ఉంచాం. ఆదోని మండలం సంతేకూడ్లూరు గ్రామంలో ఓ రైతు తన పొలంలో గంజాయి సాగుచేయడంతో ఇటీవల కర్ణాటక పోలీసులు పట్టుకున్నారు. అంతేకాకుండా నారాయణపురం గ్రామంలో కూడా గంజాయి మొక్కలు సాగు చేస్తున్న వ్యక్తిపై కేసులు నమోదు చేశాం. ఎస్పీ బిందు మాధవ్ ఆదేశాల మేరకు సిబ్బందితో కలిసి శివారు ప్రాంతాలు, రైల్వే స్టేషన్లలో తనిఖీలు నిర్వహించాం. ఎవరైనా గంజాయి విక్రయించినా, తరలించినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. కళాశాలల విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నాం.

ప్ర: మట్కా నివారణకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు.?

జ: నియోజకవర్గంలో కొందరు మట్కా, జూదంతో నష్టపోతున్నారు. మట్కా నిర్వాహకులను ఉపేక్షించం. భవిష్యత్తులో మట్కా జోలికి వెళ్లకుండా చర్యలు తీసుకుంటా.

ప్ర: సారా నియంత్రణ చర్యలు ఏవీ?

జ: నాటు సారా తయారీ కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఉంచాను. సార విక్రయాలను సహించం. నూతన మద్యం పాలసీలో మద్యం ధరలు తగ్గించిన నేపథ్యంలో ఇకనుంచి ఇతర ప్రాంతాల నుంచి అక్రమ మద్యం తరలించే అవకాశం లేదు.

ప్ర: రోడ్డు ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు.?

జ: పట్టణ రహదారులు ఇరుకుగా ఉన్నాయి. కొన్నిచోట్ల దుకాణాల వద్ద వాహనాలకు పార్కింగ్ స్థలం లేదు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నాం. మైనర్లు వాహనాలు నడపడం, ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్లడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మైనర్లు వాహనాలు నడిపితే వారి తలిదండ్రులపై కేసు నమోదు చేస్తాం. పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని వారికి వాహనాలు ఇవ్వకుండా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలి. ఆటో డ్రైవర్లు అత్యాశకు పోకుండా అనుమతి మేరకు ప్రయాణికులను ఎక్కించుకోవాలి. లేదంటే కేసులు నమోదు చేస్తాం.

భాస్కర్ రెడ్డి సేవలు మరువలేనివి



నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

- నివాళి అర్పించిన డోన్ ఎమ్మెల్యే కోట్ల

తుగ్గలి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మాజీ సర్పంచ్ భాస్కర్ రెడ్డి సేవలు మరువలేనివని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. సోమవారం ఎద్దులదొడ్డి గ్రామంలో భౌతికకాయానికి మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మతో కలిసి నివాళి అర్పించారు. భాస్కర్ రెడ్డి ఎద్దులదొడ్డి గ్రామానికి రెండుసార్లు ఏకగ్రీవంగా సర్పంచ్‌గా ఎన్నికై ఎన్నో అభివృద్ధి పనులు చేశారని అన్నారు. వారసుడిగా తమ్ముడు సింగిల్ విండో అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి టీడీపీలో ఉంటూ సేవల ు అందిస్తున్నారన్నారు. మద్దికెర మాజీ సర్పంచ్ కొత్తపేట వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్ విజ యుడు, మాజీ సర్పంచ్ చక్రాల వీరేష్ నివాళి అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

గ్రామాల అభివృద్ధికే పల్లె పండుగ

- ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు
- గ్రామాల్లో అభివృద్ధి పనుల ప్రారంభం



చక్కరాళ్ల గ్రామంలో సీసీ రహదారిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు

పత్తికొండ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రామాలను అభివృద్ధి బాట పట్టించడానికే పల్లె పండుగ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. సోమవారం చక్కరాళ్ల, దూదేకొండ, పత్తికొండలో పల్లెపండుగ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పత్తికొండ పట్టణంతోపాటు మండలపరిధిలోని చక్కరాళ్ల, దూదేకొండ గ్రామాల్లో రూ69.5లక్షల నిధులతో చేపట్టనున్న 13 పనులను ప్రారంభించారు. గ్రామాల అభివృద్ధి, తాగునీరు, సాగునీరు ప్రజలకు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతు న్నామని అన్నారు. టీడీపీ నాయకులు సాంబశివారెడ్డి, చక్రరాళ్ల ఎంపీటీసీ రాజు, మునినాయుడు, దూదేకొండ అశోక్, తిప్పన్న, హోసూరు అంజి, పత్తిపాటిప్రకాష్, రవి, మీరాహుసేన్, గుండు ఫక్రుద్దీన్, ఏపీడీ పక్కీరప్ప, పీఆర్ ఏఈ వెంకటేశ్వర్లు, ఏపీవో రామాంజనేయులు, ఈవోఆర్డీ నరసింహులు నాయకులు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి

విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. సోమవారం పల్లెపిలుపు కార్యక్రమంలో భాగంగా చక్కరాళ్లగ్రామం ఉన్నతపాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు డిజిటల్ విధానంతో బోధిస్తుండటతో వారిపక్కన కూర్చుని వీక్షించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ చదువుకు పేదరికం అడ్డుకాదని అందరూ మంచి విద్యను అందుకోవాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం కార్పొరేట్‌స్థాయి సౌకర్యాలను గ్రామాల పాఠశాలల్లో కూడా అందుబాటులోకి తెచ్చిందన్నారు. ఉపాధ్యాయులు పాఠ్యాంశం బోధిస్తే కేవలం మాటలు మాత్రమే ఉంటాయని డిజిటల్ విద్యతలో దృశ్యాలు , జీవనవిధానం, సైన్స్ దృశ్యరూపకాలు విద్యార్థుల ప్రమాణాలు పెంపొందించేందుకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలను అందుకోవాలని ఆయన సూచించారు. హెచ్‌ఎం నీలకంఠ, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఆర్డీఎస్‌కు పోటెత్తిన వరద



కోసిగి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అగసనూరు సమీపంలోని తుంగభద్ర నదిపై ఉన్న ఆర్డీఎస్ ఆనకట్టకు వరద నీరు పోటెత్తింది. సోమవారం ఎగువ కర్ణాటక రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలకు తుంగభద్ర డ్యాం నుంచి 25వేల క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేయడంతో మండల పరిధిలోని ఆర్డీఎస్ ఆనకట్టకు వరద నీరు పోటెత్తింది. నదీ తీర ప్రాంతాల ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీంతో రైతులు వరి నాట్లు వేసే పనుల్లో నిమగ్నమయ్యారు. నిండుకుండలా తుంగభద్ర నది వరద నీటితో పరవళ్లు తొక్కుతోంది.

మంత్రాలయంలో భక్తుల రద్దీ



మఠంలో కిక్కిరిసిన భక్తులు

మంత్రాలయం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మంత్రాలయంలో భక్తుల రద్దీ పెరిగింది. సోమవారం దసరా సెలవులు ముగింపు కావటంతో దక్షణాది రాష్ట్రాలనుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగాణం భక్తులతో కిక్కిరిసింది. మహాముఖద్వారం, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, తుంగభద్ర నదితీరం, మధ్వమార్గ్ కారిడార్ భక్తులతో కోలాహలంగా మారింది. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకొని రాఘవేంద్ర స్వామి నిజ మూల బృందావనానికి పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

శ్రీమఠంలో నిత్యపూజలకు విరామం: మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠంలో జరిగే నిత్య పూజలకు విరామం కల్పించారు. సోమవారం ఏకాదశి సందర్భంగా బృందావనంకు నిత్యం జరిగే అభిషేకాలు, అలంకరణ, నిత్యాన్నదానం, రథోత్సవాలు ఊరేగింపు, టెంకాయకొట్టడం, పరిమళ ప్రసాదం బంద్ చేశారు. దీంతో మఠంపీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆధ్వర్యంలో కేవలం బృందావనానికి నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం నిర్వహించి మూలరాములకు పూజలు చేసి మహా మంగళహారతులు ఇచ్చి భక్తులకు తప్త ముద్రదారణ చేశారు. అలంకరణ లేని రాఘవేంద్ర స్వామి నిజ బృందావనానికి భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. పీఠాధిపతి, పండితులు, అర్చకులు, శ్రీమఠం ఉద్యోగులు ఉపవాసంను పాటించారు.

అధ్వాన రహదారులు



కోసిగిలో గుంతల రోడ్డులో వెళ్తున్న ఆటో



హెచ్ కైరవాడి, పెద్దనేలటూరు రహదారి దుస్థితి

ఇబ్బందుల్లో ప్రజలు
పట్టించుకోని అధికారులు

కోసిగి/గోనెగండ్ల అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామీణ రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. మండల కేంద్రంలోని 9వ వార్డు ఎన్టీఆర్ నగర్‌లో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు లేక మట్టి రోడ్లు గుంతలు పడ్డాయి. చిన్నపాటి వర్షానికే రోడ్లన్నీ బురదమయంగా మారుతున్నాయి. అలాగే మండలంలోని పెద్దభోంపల్లి బీసీ కాలనీలో సైతం సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు లేకపోవడంతో మురుగు, వర్షపునీరు రోడ్లపై ప్రవహిస్తున్నాయి. గత ప్రభుత్వంలో ఏ ఒక్క రోడ్డుకు మరమ్మతులు చేయలేదని, కూట మి ప్రభుత్వమైన రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. అదేవిధంగా కోసిగి నుంచి 2కి.మీల దూరంలో ఉన్న ఆదోనికి వెళ్లే ప్రధాన రోడ్డులో గుంతలు పడిం ది. రెండు రోజుల క్రితం ఆ గుంతల రోడ్డులో పత్తి లోడుతో ఆదోనికి వెళ్లే బొలేరో వాహనం రాత్రి సమయంలో బోల్తా పడి ఒక డ్రైవర్, రైతు ప్రాణాల నుంచి బయటపడ్డారు. నిత్యం ఆ గుంతల రోడ్డులో వాహనదారులు ప్రమాదాలకు గురై ఆసపత్రుల పాలవుతున్నారు. ఇప్పటికైనా గుంతలు పడ్డ రోడ్డును బాగు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

● గోనెగండ్ల మండలంలోని హెచ్ కైరవాడి నుంచి పెద్దనేలటూరు, అలువాల, కులుమాల గ్రామాలకు వెళ్లే రహదారి అధ్వానంగా తయారయ్యాయి. రోడ్డు గుంతల మయంగా మారడంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత కొన్నేళ్లుగా రోడ్డు మరమ్మతులకు నోచుకోవడం లేదు. అలాగే మలుపులు వద్ద సూచికబోర్డులు లేకపోవడంతో ఎదురు వచ్చే వాహనం కనపడకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. గ్రామస్థులు పలుమార్లు సమస్యను ఉన్నతాధికారులు, నాయకులు దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకునే నాథుడే కరువయ్యారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారుల స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



లక్కు.. దక్కలేదు..!

ఎమ్మిగనూరు, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): లాటరీ పోయింది.. లక్కు కలిసిరాలేదు.. ఉన్న సొమ్మూ పోయింది.. మద్యం దుకాణాల్లో పోటీ పాల్గొన్న చోటా నాయకుల పరిస్థితి ఇది. ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాల్లో రూ.లక్షలు పోగొట్టుకుని పలువురు లబోదిబోమంటున్నారు. లాటరీ దక్కించుకున్న వారు సంబరాల్లో మునిగితేలారు.

● తరలివెళ్లిన ఆయ పార్టీల నాయకులు, వ్యాపారులు: ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాలోని ఆయా పార్టీల నాయకులు, పలువురు వ్యాపారులు భారీ ఎత్తున వాహనాల్లో తరలివెళ్లారు. సోమవారం కర్నూలు జిల్లా కేంద్రంలో మద్యం దుకాణాలకు లాటరీ నిర్వహించడంతో నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున తరలివెళ్లారు.

● సొమ్ము పోగొట్టుకుని..

గొల్లుమంటున్నారు: మద్యం దుకాణాలకు దరఖాస్తుల రూపంలో సొమ్ము పోగొట్టుకుని పలువురు చోటా నాయకులు గొల్లుమంటున్నారు. ఆయా పార్టీల నాయకులు, వ్యాపారులు భారీగా పోటీ పడి మద్యం దుకాణాలను దక్కించుకునేందుకు భారీగా దరఖాస్తులు చేసుకున్నారు. ముఖ్యంగా అధికార పార్టీలోనే ఎక్కువగా గ్రూపులుగా ఏర్పడి మద్యం దుకాణాలను దక్కించుకునే ప్రయత్నాలు చేశారు. అదేవిధంగా కొందరు వైసీపీ నాయకులు, పలువురు వ్యాపారులు కూడా పెద్ద ఎత్తున దరఖాస్తులు చేశారు. అయితే మద్యం దుకాణాల లాటరీలో ఇద్దరు, ముగ్గురు టీడీపీ నాయకులనే లక్కు వరించింది. మరి కొందరు నాయకులు రూ.లక్షలు చెల్లించినా ఒక్క మద్యం షాపు కూడా దక్కకపోవడంతో లబోదిబోమంటున్నారు.

లాటరీ లక్కు వీరిదే..

ఎమ్మిగనూరు, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు, మంత్రాల యం నియోజకవర్గంలో మద్యం దుకాణల లాటరీ లక్కు వీరిని వరించింది. మొత్తం 24 మద్యం దుకాణాలను దక్కించుకున్న వారి వివరాలు ఇలా ఉన్నాయి.

ఎమ్మిగనూరు మున్సిపాలిటీ పరిధిలో...

షాపు	పేరు
46	ఇ. ధరీగౌడ్
47	కే. చంద్రశేఖర్
48	బి. నాగరాజు
49	బోయ సుభాన్
50	సత్యనారాయణరెడ్డి
51	రవితేజరాజు
52	విరూపాక్షిరెడ్డి
53	నిఖిల్‌కుమార్‌గౌడ్
ఎమ్మిగనూరు రూరల్:	
54	ఉప్పరహంప్పయ్య
55	బోయ కోటేకల్ జగదీష్
56	కల్లేకుంట వెంకటేశ్వర్‌రెడ్డి
మంత్రాలయం మండలం:	
57	కమ్మరి విజయకుమార్
58	కమ్మరి విజయకుమార్
నందవరం మండలం:	
59	మాచారి వెంకటేశ్వర్లు
60	ఈడిగ నర్సింహులు
కౌతాళం మండలం:	
71	రుద్రముడిగౌడ్
72	రమణగౌడ్‌రెడ్డి
కోసిగి మండలం:	
73	పైఇంటి రామిరెడ్డి
74	వెన్నపూసపావణి
పెద్దకడబూరు మండలం:	
75	దిద్దికాటి తూకారం
76	కె. లక్ష్మన్న
గోనెగండ్ల మండలం:	
96	తలారీ అనిత
97	బి. విశ్వానందరెడ్డి
98	తలారీ అంబామ్మ

పల్లె పండుగతో గ్రామాల అబివృద్ధి: ఎమ్మెల్యే







జగ్గాపురం, కౌతాళంలో భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి, జాలవాడిలో పల్లెపండుగ కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ నాయకులు

నందవరం, అక్టోబరు 14 (ఆంధజ్యోతి): పల్లె పండుగతోనే గ్రామాల అబివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని హలహర్వి, జగ్గాపురం గ్రామాల్లో పల్లె పండగ కార్యక్రమం జరిగింది. హలహర్వి గ్రామంలో రూ.10 లక్షలతో సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. అలాగే రైతుకేంద్రం, సచివాలయం, రూ 2లక్షల 15వేలతో గోకుల షెడ్‌ను ప్రారభించారు. అనంతరం జగ్గాపురం గ్రామంలో రూ 10లక్షలతో సీసీ రోడ్డు, గోకుల షెడ్ పనులకు రూ. 2లక్షల 30 వేల పనులకు భూమి పూజ చేశారు. అలాగే నూతన సచివాలయాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే బీవీ మాట్లాడుతూ గ్రామాల్లో పల్లె పండగా ద్వారా అన్ని గ్రామాలు, వార్డులలు అభివృద్ధి చెందుతాయన్నారు. కార్యక్రమంలో పీఆర్ ఈఈ వెంకటేశ్వర్లు, డీఈ చంద్రశేఖర్, ఏఈ నరసింహులు, తహసీల్దారు శ్రీనివాసులు, ఎంపీడీవో పులయ్య, టీఈ బషీర్, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జులు మాజాపురం కాశీంవలి, ధర్మాపురం గోపాల్, టీడీపీ మండల కన్వీనర్ డీవీ రాముడు, మాజీ ఎంపీటీసీ లక్ష్మీదేవి, నరసింహులు, గట్టాల రంగన్న, దస్తగిరి, హలహర్వి దావీదు, జగన్నాథరెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు రూరల్: మండలంలోని బనవాసి, ఏనుగుబాల గ్రామాల్లో పల్లెపండుగ కార్యక్రమాలను అధికారులు నిర్వహించారు. బనవాసి గ్రామంలో ఎంపీడీవో బంగారమ్మ, ఏపీవో విజయ మోహన్, ఏనుగుబాల గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ ఈసీ భాగ్యరాజుల ఆధ్వర్యంలో పల్లెపండుగ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏనుగుబాల గ్రామంలో రూ.10లక్షలతో సీసీ రోడ్డుకు గ్రామ టీడీపీ సీనియర్ నాయకులు రామలింగారెడ్డి భూమి పూజ చేశారు.

కౌతాళం: గ్రామాలాభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి అన్నారు. సోమవారం కౌతాళం, పొదలకుంట, కాత్రికి గ్రామాలలో పల్లెపండుగ కార్యక్రమాలు మండల టీడీపీ అధ్యక్షుడు ఉలిగయ్య, మండల అధికారులు నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాఘవేంద్రరెడ్డి హాజరై మాట్లాడారు. అనంతరం గ్రామంలోని పలు కాలనీల్లో సీసీ రోడ్లకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ మల్లికార్జున స్వామి, ఎంపీడీఓ సుబ్బరాజు, టీడీపీ నాయకులు అడివప్పగౌడ్ పాల్గొన్నారు.

పెద్దకడుబూరు: పల్లెటూర్ల అభివృద్దే కూటమి ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ రాష్ట్ర రైతు సంఘం అధికార ప్రతినిధి నరవ రమాకాంతరెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని కంబళదిన్నె, జాలవాడి గ్రామాల్లో పల్లెపండుగ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు భూమి పూజలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనాథ్, ఎంపీడీవో జయరాముడు, ఏపీవో ఖాదర్‌బాషా, పీఆర్ఏఈ ఖాదర్ బాషా, బీజేపీ నాయకులు పురుషోత్తంగౌడు, యేసేబు, ముక్కన్న, కంబగిరి, గోవిందు, అంజి, నాగేంద్ర, యంకన్న పాల్గొన్నారు.

కోసిగి: పల్లె ప్రగతికి.. పల్లె పండుగతో ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లు శ్రీకారం చుట్టారని కర్నూలు టీడీపీ పార్లమెంటు ఉపాధ్యక్షుడు ముత్తురెడ్డి అన్నారు. సోమవారం అగసనూరు, ఆర్లబండ గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా రూ.11 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలకు భూమి పూజ చేశారు. అగసనూరు గ్రామంలో రూ.5 లక్షలు, ఆర్లబండలో రూ.6 లక్షల నిధులతో ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఏపీవో చంద్రశేఖర్, పంచాయితీ కార్యదర్శి మహ్మద్ ఆలీ, రామరాజు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కాత్యాయని, వీఆర్వో బసవరాజు, పంచాయతీరాజ్ ఏఈ మాలిక్, టీడీపీ నాయకులు నాడిగేని అయ్యన్న, చిన్న తాయన్న, వీరారెడ్డి, ఆర్లబండ సర్పంచ్ మల్లికార్జున, అయ్యప్ప, నర్సన్న, వీరేష్, పోతుల వీరారెడ్డి, వీరయ్య పాల్గొన్నారు.

మంత్రాలయం: గ్రామాలు అభివృద్ధి చెందాలంటే.. టీడీపీతోనే సాధ్యమవుతుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి సోదరుడు రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. సోమవారం పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా చిలకలడోన, కల్లుదేవకుంట గ్రామాల్లో మండల స్పెషల్ ఆఫీసర్ నారాయణమూర్తి ఎంపీడీవో శోభారాణి, ఈవోఆర్‌డీ ప్రభావతిదేవి, పంచాయతీరాజ్ ఏఈఈ మల్లయ్య, ఏపీవో తిమ్మారెడ్డి అధ్యక్షతన బీసీ, ఎస్సీ కాలనీల్లో భూమి పూజ చేశారు. టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి చావిడి వెంకటేశ్, నాయకులు అశోక్ రెడ్డి, వరదరాజులు, నగేష్, మల్లయ్య, భీమయ్య, హనుమంతు, మాదప్ప, శివ, ఎంపీటీసీ మేకల వెంకటేశ్, సర్పంచులు నాగమ్మ, ఆకుల లక్ష్మి పాల్గొన్నారు.

న్యాయం జరిగే వరకు పోరాటం



గోవిందమ్మ ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకుంటున్న తహసీల్దార్ శేషఫణి

ఎమ్మిగనూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): నాకు అధికారులు న్యాయం చేసేవరకు పోరాటం చేస్తానని దళిత గోవిందమ్మ అన్నారు. పెద్దకడుబూరు మండలం కల్లుకుంట గ్రామానికి చెందిన గోవిందమ్మపై అదే గ్రామానికి చెందిన కొంతమంది దాడికి పాల్పడిన విషయం తెలిసిందే. దీంతో ప్రజా, దళిత సంఘాల ఆధ్వర్యంలో ఆమె 13 రోజులుగా పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో దీక్ష చేపట్టారు. దీంతో సోమవారం తహసీల్దార్ శేషఫణి దీక్షా శిబిరం దగ్గరకు వెళ్లి గోవిందమ్మ ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్నారు. గోవిందమ్మ మాట్లాడుతూ తనకు జరిగిన అన్యాయం మరొకరికి జరగరాదని, తనకు న్యాయం జరిగే వరకు దీక్ష కొనసాగిస్తామని తహసీల్దార్‌కు చెప్పారు. గోవిందమ్మ దీక్షకు సీపీఐ మహిళా సంఘం నాయకురాళ్లు వాణి, ఈరమ్మ, మల్లేశ్వరమ్మ, గోవిందమ్మ, శాంతమ్మ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జయన్న, రంగన్న, నాగేష్, దేవరాజు, సురేష్, జైపాల్, శాంతిరాజు పాల్గొన్నారు.

పెద్దకడుబూరు: మండలంలోని కల్లుకుంట గ్రామానికి చెందిన గోవిందమ్మకు న్యాయం చేయాలని దళిత సంఘాల నాయకులు లక్ష్మీనారాయణ, అమరేష్, బతకమ్మ, చార్లెస్, మాల నరసన్న, గడ్డం ఉసేని, పందికోన ఈరన్నలు డిమాండ్ చేశారు. సోమవారం పెద్దకడుబూరులో నిరసన ర్యాలీని యువరాజు, ముక్కరన్న, అర్లప్ప, ఆనంద్, శాంతిరాజుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ దళిత మహిళ గోవిందమ్మ 13 రోజుల నుంచి దీక్ష చేస్తున్నా అధికారులు ఎందుకు స్పందించడం లేదన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఉదయ్, అజిత్, శ్యామ్యూల్, ప్రసన్న పాల్గొన్నారు.

మఠానికి భోజనం ప్లేట్లు విరాళం



దాత వెంకట రాములు కుటుంబ సభ్యులతో పీఠాధిపతి

మంత్రాలయం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠానికి తెలంగాణ లోని గద్వాల మండలం వీరాపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ వెంకటరాములు అనే భక్తుడు అన్నదానానికి 1000 భోజనం ప్లేట్లు విరాళంగా ఇచ్చినట్లు మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజరు వెంకటేష్ జోషి తెలిపారు. సోమవారం కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని రూ.1.50 లక్షలు విలువ చేసే 1000 ప్లేట్లను మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు, విద్వాన్ పండితకేసరి రాజా ఎస్ గిరిరాజాచార్‌లకు అందజేశారు. విరాళం ఇచ్చిన దాత వెంకటరాములు, భార్య స్వప్న, కొడుకు కృష్ణ రాంభూపాల్, మణి చక్రవర్తిలకు శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు రాఘవేంద్ర స్వామి మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, చీర ఇచ్చి ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఈశ్వర్ రెడ్డి, వాజేంద్ర ఆచార్, వ్యాసరాజ ఆచార్‌లు పాల్గొన్నారు.

పప్పుశనగలో యాజమాన్య పద్ధతులు పాటించాలి

గోనెగండ్ల, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): పప్పుశనగలో రైతులు యాజమాన్య పద్ధతులను పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ అన్నారు. సోమవారం ఆయన మండలంలోని తిప్పనూరు, వేముగోడు గ్రామాలలో ఆయన పర్యటించి పంటను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మిగనూరు డివిజన్‌లో రబీసీజన్‌లో పప్పుశనగ పంటను రైతులు అధికంగా సాగు చేస్తారని అన్నారు. పంటను అక్టోబరు 15 నుంచి నవంబరు 15 వరకు సాగు చేసుకోవచ్చునన్నారు. ఈ పంట గింజలను 5 నుంచి 8 సెంటీమీటర్ల లోతున విత్తనం పడేటట్లు విత్తుకోవాలని వరసల మధ్య 30 సెంటీమీటర్లు ఉండాలన్నారు. ఎకరాకు 35 నుంచి 40 కిలోల విత్తనాలు విత్తుకోవాలని కోరారు. విత్తనాలకు విత్తనశుద్ధి చేసుకోవాలని సూచించారు. విత్తనం విత్తిన 24 గంటలలోపు ఎకరాకు 1.2 లీటర్ల పెండిమిథాలిన్ కలుపు మందును పిచికారీ చేయాకుంటే కలుపును నివారించవచ్చునన్నారు. 30 రోజులు కలుపు లేకుండా చూసుకోవాలని సూచించారు.

పారిశుధ్య కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

ఎమ్మిగనూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి సత్యన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కార్మికులతో కలిసి మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు, పాలకులు మారినా మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికుల బతుకులు మారడంలేదన్నారు. చనిపోయిన పారిశుధ్య కార్మికుల కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, కార్మికులకు ప్రతియేడాది బట్టలు, సబ్బులు, నూనె, గ్లౌజులు, పాదరక్షలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు బాలరాజు, బాబు, దినకర్, నాగేష్, అశోక్‌రాజు, నరసింహులు, భాస్కర్, భీమన్నలు పాల్గొన్నారు.

భక్తులను మోసం చేసిన వ్యక్తి అరెస్టు

మంత్రాలయం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలోని సూగూరు గ్రామంలో వీరనాగప్ప దేవర ఉత్సవాల్లో బొమ్మల ఆటతో భక్తులను మోసం చేస్తు అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు మంత్రాలయం ఎస్ఐ పరమేష్ నాయక్ తెలిపారు. సోమవారం నందవరం మండలంలోని గంగావరం గ్రామానికి చెందిన ప్రేమ్ దాస్ అనే వ్యక్తి దేవర ఉత్సవాల్లో భక్తులను మోసం చేస్తుండగా భక్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆ వ్యక్తిని పట్టుకొని కేసు నమోదు చేసి అరెస్టు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

డెంగీతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

గోనెగండ్ల, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): డెంగీ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆదోని డివిజన్ మలేరియా నివారణ అధికారి సాయిబాబా అన్నారు. సోమవారం హెచ్ కైరవాడి గ్రామంలోని బీసీ కాలనీలో ఆరేళ్ల పిల్లాడికి డెంగీ సోకింది. వైద్యాధికారులు గ్రామంలో పర్యటించి, వీధుల్లో ఉన్న మురుగునీటిని తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. వైద్యశిబిరాలను ఏర్పాటు చేశారు. రోగులకు జ్వరం, దగ్గు, జలుబు, ఇతర వ్యాధులు ఉన్నవారికి ఉచితంగా మందులను అందజేశారు. 20 రోజులలో మండలంలోని హెచ్‌కైరవాడి, చిన్నమరివీడు, వేముగోడు గ్రామాలలో ఐదు డెంగీ కేసులు నమోదయ్యాయన్నారు. సూపర్‌వైజర్ పరమేష్, ఏఎన్ఎంలు, వైద్యసిబ్బంది ఆశా వర్కర్లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేటు ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలి

ఎమ్మిగనూరు రూరల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలో ఉన్న ప్రైవేటు ఆసుపత్రులు సిజేరియన్ పేరుతో దోపిడీకి పాల్పడుతన్నారని ఏపీ మహిళా సమాఖ్య పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు వాణి, ఈరమ్మలు డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ శేషఫణిని కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాగవేణి, ఈరమ్మ, వెంకటలక్ష్మి, సరోజ పాల్గొన్నారు.

సాయిబాబాకు ఘన నివాళి

ఎమ్మిగనూరు, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): అణగారిన ప్రజల హక్కుల కోసం పనిచేసిన వ్యక్తి అమరుడు ప్రొఫెసర్ సాయిబాబా అని పౌరహక్కుల సంఘం నాయకులు వెంకటేష్, సీపీఐ నాయకులు రంగన్న, పంపన్నగౌడు, సీపీఎం నాయకులు గోవిందు, ఐఎఫ్‌టీయూ నాయకులు రాజు, చేనేత నాయకులు నీలకంఠ అన్నారు. సోమవారం పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో సాయిబాబా సంతాప సభను నిర్వహించారు. సాయిబాబా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

ఎల్‌ఐసీని నిర్వీర్యం చేసేందుకే కమీషన్ తగ్గింపు

ఎమ్మిగనూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎల్ఐసీని నిర్వీర్యం చేసేందుకే ఎల్ఐసీ ఏజెంట్ల కమిషన్ తగ్గింపు చేశారని లియాఫి ఎమ్మిగనూరు బ్రాంచ్‌అధ్యక్ష, కార్యదర్శులు ప్రభాకర్‌రెడ్డి, జయన్న, జోనల్, డివిజన్ నాయకులు రమేష్, ఆంధ్రయ్య, ఆర్థిక కార్యదర్శి వీరేష్ అన్నారు. ఎల్ఐసీ ఏజెంట్ల కమిషన్లు తగ్గించడాన్ని నిరసిస్తూ సోమవారం కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ 1956నుంచి ఏజెంట్లకు పాలసీ ప్రీమియంపై ఇచ్చే కమీషన్ రేట్లను తగ్గించడం శోచనీయమన్నారు. ఏజెంట్లు ఐక్యమత్యంగా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు సత్యారెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, ప్రసాద్, అబ్దుల్‌గఫూర్, ప్రభాకర్, హరినాథ్, గురురాజ్, నారాయణ, సూర్యకాంతరెడ్డి, దేవేంద్రమూర్తి, గోవిందు పాల్గొన్నారు.

మంత్రాలయంలో బెంగళూరు ఎస్పీ

మంత్రాలయం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం బెంగళూరు ఎస్పీ వరుణ్ కే గౌడ సోమవారం రాత్రి మంత్రాలయానికి వచ్చారు. ఈయనకు మేనేజర్లు వెంటేష్ జోషి, శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహామూర్తి లు ఘనంగా స్వాగతం పలికారు. రాఘవేంద్ర స్వామి నిజ బృందావనానికి దర్శించుకున్నారు. సోమవారం రాత్రి సర్వజ్ఞ గెస్టుహౌస్‌లో బస చేసి శనివారం ఉదయం గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేయనున్నారు. అనంతరం మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించనున్నారు. ఈయన వెంట తహసీల్దార్ ఎస్ రవి, ఎస్ఐ పరమేష్ నాయక్, బిందు మాధవ్, అనంతస్వామి, పవన్‌ఆచార్, వ్యాసరాజార్, జయతీర్థ ఆచార్, వీఆర్ఓ భీముడు పాల్గొన్నారు.